


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 26-05-2025 | సంపుటి - 24 | సంచిక - 23 | రూ : 4 | పేజీలు: 8




## ఉక్రెయిన్‌పై అతి పెద్ద గగనతల దాడి

- 69 క్షిపణులు, 298 డ్రోన్లు ప్రయోగించిన రష్యా
- 12 మంది మృతి

2లో

# పదవులపై కదలిక

- త్వరలోనే పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించనున్న అధిష్ఠానం
- కేసీ వేణుగోపాల్‌తో సీఎం, పీసీసీ అధ్యక్షుడి చర్చలు
- మంత్రివర్గ విస్తరణపైనా సమాలోచనలు
- నేడు మరోసారి భేటీ

2లో



## కఠినంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష!

- తెలంగాణ నుంచి 28, 209 మంది హాజరు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఆదివారం జరిగిన సివిల్స్ ప్రాథమిక పరీక్ష కఠినంగా ఉందని అభ్యర్థులు, నిపుణులు చెబుతున్నారు. అంశాలపై లోతైన, విశ్లేషణాత్మక పరిజ్ఞానాన్ని పరీక్షించేలా ప్రశ్నలున్నాయని పేర్కొన్నారు. 100 ప్రశ్నల్లో అత్యధికంగా చరిత్ర, ఇండియన్ పాలిటీ నుంచి 16 చొప్పున, ఆర్థికం సామాజిక అంశాలపై 15, జాగ్రఫీ 14, పర్యావరణం 13, వర్తమాన వ్యవహారాలు 12, జనరల్ సైన్స్9, జనరల్ నాలెడ్జి నుంచి 5 ప్రశ్నలు వచ్చాయని సివిల్స్ నిపుణుడు గోపాలకృష్ణ తెలిపారు. కేవలం ఏడాదిపాటు సన్నద్ధమైన వారికి ఈసారి పరీక్ష మరింత కఠినంగా ఉందని ఆయన తెలిపారు. మధ్యాహ్నం జరిగిన సీశాట్ పేపర్2 కూడా కఠినంగా ఉందన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్‌లో పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్‌లో 43,676 మందికి 25,787 మంది, వరంగల్‌లో 4,141 మందికి 2,422 మంది హాజరయ్యారు. మొత్తం 47,817 మందిలో 58(28,209)% మందే హాజరయ్యారు.






## కవిత వ్యాఖ్యలపై తొందరపడి స్పందించొద్దు!

- భారాస నాయకులకు కేటీఆర్ అంతర్గత సమాచారం
- కేసీఆర్‌తో భేటీ.. వివిధ అంశాలపై చర్చ
- రాజకీయ పరిణామాలు, కాళేశ్వరం కమిషన్ నోటీసులపైనా..

**మే 25, దిల్లీ:** హైదరాబాద్: ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై పార్టీ నాయకులెవరూ తొందరపడి స్పందించవద్దని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. ముఖ్య నాయకులకు అంతర్గతంగా సమాచారమిచ్చినట్లు తెలిసింది. ఎర్రవల్లిలోని నివాసంలో భారాస అధినేత కేసీఆర్‌తో ఆదివారం కేటీఆర్ భేటీ అయ్యారు. ఇటీవల కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ బయటకు వచ్చిన విషయం తెలిసిందే. దానిపై ఆమె పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ దేవుడని.. కానీ, ఆయన చుట్టూ దయ్యాలున్నాయని, భారాసలో కోవర్టులను దూరం పెట్టాలని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేసీఆర్, కేటీఆర్‌ల భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. పార్టీలో అంతర్గత విభేదాలున్నాయంటూ జరుగుతున్న ప్రచారం, విమర్శలపై వారు చర్చించినట్లు సమాచారం. కవిత రాసిన లేఖ, అమెరికా పర్యటన నుంచి తిరిగివచ్చిన తర్వాత ఆమె చేసిన వ్యాఖ్యలు తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఈ తరహా ప్రచారానికి, విమర్శలకు, పార్టీలో వ్యక్తమయ్యే భిన్నాభిప్రాయాలకు తొందరపడి స్పందించాల్సిన అవసరం లేదని, ఈ విషయాలపై ఎక్కువగా చర్చిస్తే.. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో అనవసరమైన గందరగోళం నెలకొనే

తరువాయి 2లో

## నీటిపై తేలుదాం.. గాల్లో విహరిద్దాం!



- రాష్ట్రంలో అందుబాటులోకి రానున్న సీ ప్లేన్ సేవలు
- తొలిదశలో అమరావతి, తిరుపతి, గండికోట నుంచి
- డీపీఆర్‌ల తయారీకి అనుమతులు

2లో

## 'ధరణి' మారినా అదే తీరు!

- లావాదేవీ రద్దు చేసుకున్న వారికి వెనక్కిరాని డబ్బులు
- విసుగుపోతున్న భూ యజమానులు

**మే 25, హైదరాబాద్:** ఏదేని కారణంతో రిజిస్ట్రేషన్ రద్దు చేసుకుంటే.. లావాదేవీ కోసం చెల్లించిన రుసుం వెనక్కి రావడం లేదు. ఎవరిని అడగాలో తెలియక భూ యజమానులు

తరువాయి 2లో




# ఉత్తమ పాలనా విధానాలు ఆచరించండి

- రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రధాని

- వికసిత భారత్‌కు అవి సోపానాలు
- కులగణనతో వృద్ధి పథంలోకి బడుగులు
- కుల రాజకీయాలపై నమ్మకం లేదు
- ఎన్డీయే సీఎంల సమావేశంలో మోదీ
- ప్రధాని నేతృత్వాన్ని కొనియాడిన ముఖ్యమంత్రులు

దిల్లీ: దేశంలో ఎన్డీయే కూటమి పాలిత రాష్ట్రాలు ఉత్తమ పాలనా విధానాలను ఆచరించి, వికసిత భారత్ లక్ష్యాలు సాకారమయ్యేందుకు దోహదపడాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఆదివారం దిల్లీలో నిర్వహించిన ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కూటమి పక్షాలు ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఉత్తమ అభ్యాసాలపై చర్చకు సమావేశంలో ఎక్కువ సమయం కేటాయించారు. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలు సహా సీఎంలు తమతమ రాష్ట్రాల్లో చేపట్టిన ఉత్తమ పాలనా విధానాలు, ప్రభావవంతమైన కార్యక్రమాలు, పథకాల గురించి వివరించారు. వీటిని అధ్యయనం చేసి, ఇతర చోట్ల కూడా అమలు చేసేందుకు వీలుగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. ఎన్డీయే రాష్ట్రాలు సమన్వయంతో చేసే ప్రయత్నాలు.. వికసిత భారత్ లక్ష్యాలను సత్వరం చేరుకునేందుకు దోహదపడతాయని

తరువాయి 2లో



# పదవులపై కదలిక

హైదరాబాద్, ఢిల్లీ : ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) రాష్ట్ర కార్యవర్గానికి తుదిరూపు ఇస్తున్నారు. అతి త్వరలోనే కాంగ్రెస్ అధిష్ఠానం జాబితా ప్రకటించనుందని తాజా సమాచారం. పీసీసీ కార్యవర్గంతో పాటు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం రాత్రి చర్చలు జరిపారు. పీసీసీ కార్యవర్గం ఖరారులో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిందని వారు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణ, పార్టీ పదవులు ఆశిస్తున్న ముఖ్య నేతల గురించి చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మంత్రివర్గ విస్తరణ చేపడితే ఏయే సామాజిక వర్గాలకు పదవులు ఇవ్వాలనే అంశాన్ని సీఎం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు.

* **వర్కింగ్ ప్రెసిడెంట్లలో ఎమ్మెల్యే, ఎంపీ!**

పీసీసీ కార్యవర్గంలో తొలుత వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను మాత్రమే ప్రకటించే అవకాశాలున్నాయి. ఈ పదవులకు పోటీ ఎక్కువగా ఉంది. వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా నలుగురు లేదా ఐదుగురికి అవకాశమివ్వాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. వీరిలో ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ ఉండవచ్చని తెలుస్తోంది. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఒక్కో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కేటాయించే అవకాశముంది. ఎంపీల్లో బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. తనకు ఏ పదవి ఇచ్చినా అంకితభావంతో పనిచేస్తానని బలరాం నాయక్ 'ఈనాడు'కు తెలిపారు. మంత్రి పదవులకు ఎక్కువ మంది పోటీపడుతుండటంతో అందులో సర్దుబాటు చేయలేని ఎమ్మెల్యేకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వడంపై చర్చలు సాగుతున్నాయి. జిల్లాలవారీగా 2017 నుంచి కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ కోసం పనిచేసిన ముఖ్యనేతల పేర్లు, వారి వివరాలను ఇప్పటికే ఏఐసీసీ సేకరించింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల అభిప్రాయాలను కూడా తీసుకుంది. ఎవరికి ఏ పదవి ఇవ్వాలనే అంశంపై అధిష్ఠానానికి ఇప్పటికే స్పష్టత ఉందని సీనియర్ నేతలు తెలిపారు. ఒక్కో పదవికి ముగ్గురి పేర్లను పీసీసీ ప్రతిపాదించినట్లు సమాచారం. ఏ ఒక్క సామాజికవర్గానికి రెండు పదవులు ఇవ్వకూడదనే విధానం అనుసరించనున్నారు. ఉదాహరణకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులను ఒకే సామాజికవర్గానికి చెందిన ఇద్దరికి ఇవ్వరు.

* **మంత్రి పదవులకు పోటాపోటీ..**

మంత్రి పదవులకు ఒకే సామాజికవర్గానికి చెందిన పలువురు పోటీపడుతుండటంతో ఆ విషయంలో ఏం చేయాలనే దానిపై పార్టీ పరిశీలిస్తోంది. తెలంగాణలో మాదిగల జనాభా ఎక్కువగా ఉన్నా పదవులు తక్కువగా వచ్చాయని, మంత్రివర్గ విస్తరణలో తప్పనిసరిగా అవకాశం ఇవ్వాలని కోరుతూ ఆ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణను దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలు చేస్తున్నందువల్ల మాదిగలకు మంత్రి పదవులు దక్కాలని వారు విన్నవించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు ఈ వర్గానికి చెందిన ఎమ్మెల్యే ఒకరు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్సీ టికెట్ల కేటాయింపులో తమ వర్గానికి న్యాయం జరగలేదని, మంత్రివర్గ విస్తరణలోనైనా సర్దుబాటు చేయాలని కోరినట్లు ఆయన వివరించారు. మంత్రివర్గ విస్తరణ చేపడితే బీసీ, ఎస్సీ, ఓసీ, మైనార్టీలకు ఒక్కో పదవి ఇచ్చే అవకాశాలను అధిష్ఠానం పరిశీలిస్తోంది. అయితే, ఒక్కో సామాజికవర్గంలోనే ఎక్కువ మంది పోటీపడుతుండటంతో వారిలో ఎవరికివ్వాలనే దానిపైనే చర్చలు సాగుతున్నట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

* **తిరుగు ప్రయాణం విరమించుకొని ఢిల్లీలోనే..**

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశానికి హాజరైన అనంతరం ప్రధాని మోదీ, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిని కలిశారు. ఆదివారం రాత్రి వరకూ ఢిల్లీలోని అధికార నివాసంలోనే ఉన్నారు. రాష్ట్రానికి చెందిన పార్టీ ఎంపీలతో ఇష్టాగోష్ఠిగా సమావేశమయ్యారు. ఆదివారం రాత్రి 8 గంటలకు హైదరాబాద్ తిరిగి వెళ్లాల్సి ఉండగా.. ఆ తర్వాత కేసీ వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ ఖరారవడంతో రాత్రి 9.30 గంటలకు బయలుదేరాలనుకున్నారు. కానీ, సమావేశం ముగిసిన తర్వాత హైదరాబాద్ ప్రయాణాన్ని విరమించుకొని ఢిల్లీలోనే ఉండిపోయారు. సోమవారం వేణుగోపాల్‌తో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ శాసనసభలో ఆమోదించిన బిల్లును కేంద్రానికి పంపిన నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు సోమవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో సామాజిక న్యాయసదస్సు నిర్వహించబోతున్నారు. ఇందులో ముఖ్యమంత్రి పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## కవిత వ్యాఖ్యలపై తొందరపడి స్పందించొద్దు!

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాలున్నాయని కేసీఆర్ పేర్కొన్నట్లు సమాచారం. పార్టీలో అంతర్గతంగా చర్చించుకోవాల్సిన అంశాలు ఇప్పటికే బహిర్గతమయ్యాయని, జరిగిన పరిణామాల పట్ల పార్టీ నాయకులెవరూ బహిరంగ వేదికలపై, టీవీల చర్చల్లో మాట్లాడొద్దని ఆయన సూచించినట్లు తెలిసింది. కేసీఆర్‌తో సమావేశం అనంతరం కేటీఆర్ తనకు సన్నిహితులైన నాయకులతో ఇదే విషయం చెప్పినట్లు సమాచారం. సామాజిక మాధ్యమాల్లో కవిత అనుకూలురు చేస్తున్న ప్రచారంపైనా కేసీఆర్, కేటీఆర్‌లు చర్చించినట్లు తెలిసింది.

**కాళేశ్వరం కమిషన్ నోటీసులపై న్యాయనిపుణులతో సంప్రదింపులు**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో గత నెల 27న జరిగిన పార్టీ రజతోత్సవ సభ అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, వాటిపై భారాస స్పందిస్తున్న తీరుపై కేసీఆర్, కేటీఆర్‌లు చర్చించినట్లు సమాచారం. కాళేశ్వరం కమిషన్ నోటీసులపై ఎలా స్పందించాలనే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది. కమిషన్‌ను కలిసి నేరుగా సమాధానం ఇవ్వాలా? లేదా రాతపూర్వకంగా ఇవ్వాలా? అసలు ఇవ్వాలా? వద్దా? తదితర అంశాలపై న్యాయనిపుణులతో సంప్రదించి నిర్ణయం తీసుకోనున్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా భారాస తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలపై కేటీఆర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. రాబోయే రోజుల్లో పార్టీపరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, కార్యాచరణ, జూన్ రెండో వారంలో పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు తదితరాలూ చర్చలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. త్వరలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి, సభ్యత్వ నమోదుకు సంబంధించి మార్గదర్శకాలు ఇవ్వాలని కేసీఆర్ ఆదేశించినట్లు తెలిసింది. డిజిటల్ సభ్యత్వ నమోదుకు ఏర్పాట్లు, అందుకు రూపొందించిన యాప్‌నకు సంబంధించిన వివరాలపై కేసీఆర్ ఆరా తీసినట్లు సమాచారం. పార్టీని బలోపేతం చేయడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టాలని, అందుకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కేటీఆర్‌కు ఆయన సూచించినట్లు తెలిసింది.

**28న అమెరికాకు కేటీఆర్**

అమెరికాలోని డాలస్‌లో జూన్ 1న జరిగే పార్టీ రజతోత్సవ సభకు హాజరయ్యేందుకు ఈ నెల 28న కేటీఆర్ బయలుదేరి వెళ్లనున్నారు. డాలస్ సభలో ప్రసంగించాల్సిన అంశాలపై కేసీఆర్‌తో కేటీఆర్ చర్చించినట్లు సమాచారం. ప్రవాస తెలంగాణవాసులతో జరపాల్సిన భేటీలపై కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకలను తెలంగాణ భవన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే బాధ్యతను మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారికి అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

## ఉత్తమ పాలనా విధానాలు ఆచరించండి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పేర్కొన్నారు. బడుగు బలహీనవర్గాలవారిని అభివృద్ధిపరమైన ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు కులగణన ఓ ముందడుగు అవుతుందని, అయితే తమ ప్రభుత్వం కుల రాజకీయాలను నమ్మబోదని చెప్పారు. అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి మాత్రం ప్రాధాన్యమిస్తామన్నారు. ''రక్షణరంగంలో దేశం సాధించిన స్వయం సమృద్ధికి ఆపరేషన్ సిందూర్ విజయం ఒక తార్కాణం. ఇలాంటి అంశాలపై మాట్లాడేటప్పుడు ఎక్కడా హద్దు మీరొద్దు. ఈ ఆపరేషన్లో సైనిక బలగాలు ఎంతో ధైర్యసాహసాలతో పరాక్రమాన్ని ప్రదర్శించాయి. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను వేగంగా తీర్చిదిద్దడం, శక్తిమంతమైన.. స్వయం సమృద్ధ దేశంగా తయారు చేయడం మన లక్ష్యం'' అని మోదీ చెప్పారు.

**ఆత్మవిశ్వాసాన్ని పెంచిన ఆపరేషన్ సిందూర్**

'ఆపరేషన్ సిందూర్' వల్ల భారతీయుల్లో ఆత్మవిశ్వాసం ఇనుమడించిందని పేర్కొంటూ ఈ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఉగ్రవాదులకు బుద్ధిచెప్పడంలో ప్రధాని మోదీ సాహసోపేత నాయకత్వాన్ని కనపరిచారని కొనియాడింది. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందింది. సైనిక దళాలకు మోదీ అన్నివేళలా మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొంది. ఉగ్రవాదులకు, వారి ప్రాయోజకులకు భారత సైన్యం దీటైన సమాధానం ఇచ్చిందని కొనియాడింది. సమావేశంలో ప్రధానితో పాటు కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, జె.పి.నడ్డా తదితరులు పాల్గొన్నారు. కుప్పంలో నూతన గృహప్రవేశ కార్యక్రమం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సమావేశానికి రాలేకపోయారు. ఆయన మినహా 20 మంది సీఎంలు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో సహా 18 మంది డిప్యూటీ సీఎంలు హాజరయ్యారు. పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి సమావేశం నివాళులర్పించింది. దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసిస్తూ మరో తీర్మానాన్ని ఈ సమావేశం ఆమోదించింది.

## ఉక్రెయిన్‌పై అతి పెద్ద గగనతల దాడి

కీవ్: కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్న వేళ ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి చేసింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా 367 డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా 69 క్షిపణులు, 298 డ్రోన్లను ప్రయోగించినట్లు వెల్లడించారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ బాంబు మోతలతో దద్దరిల్లింది. రష్యా దాడిలో ఉక్రెయిన్‌లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. 60 మందికిపైగా గాయపడ్డారు. 80 నివాస భవనాలు సైతం ధ్వంసమయ్యాయి. దాదాపు 27 చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఇరాన్ రూపొందించిన షాహెద్ డ్రోన్లను ఉక్రెయిన్‌పై రష్యా ప్రయోగించింది. రష్యా దాడులకు భయపడి వందలాది ఉక్రెయిన్ పౌరులు అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్లలోకి వెళ్లి తలదాచుకున్నారు.

**అమెరికా మౌనం వీడాలి!**

ఉక్రెయిన్‌లో 30 నగరాలు, గ్రామాలను రష్యా క్షిపణులు తాకినట్లు ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని పశ్చిమ దేశాలను కోరారు. ప్రజలు నివాసం ఉండే భవనాలే లక్ష్యంగా రష్యా దాడి చేసిందని, వాటిని ధ్వంసం చేసిందని ఆరోపించారు. రష్యా యుద్ధాన్ని పొడిగిస్తోందని ప్రతీరోజు ఉక్రెయిన్ ప్రజల ప్రాణాలు తీస్తోందని వాపోయారు. అమెరికా మౌనంగా ఉంటే అది పుతిన్‌ను మరింత ఉత్సాహపర్చినట్లు అవుతుందని అన్నారు. యుద్ధ ఖైదీల అప్పగింతలో భాగంగా ఆదివారం ఉక్రెయిన్, రష్యాలు 303 మందిని మార్పిడి చేసుకున్నాయి.

## నీటిపై తేలుదాం.. గాల్లో విహరిద్దాం!

అమరావతి: విమానాశ్రయంలో రన్‌వేపై దూసుకెళ్లి.. ఆపై ఎక్కడో జలాశయానికి చేరుకొని, అక్కడ నీటిపై తేలియాడుతూ.. మళ్లీ నింగిలోకి ఎగిరి విహరించేలా చేసే సీ ప్లేన్ సేవలు రాష్ట్రంలో త్వరలో అందుబాటులోకి రానున్నాయి. పర్యాటకాన్ని ప్రోత్సహించేలా ఈ సర్వీసులు నడిపేందుకు మొత్తం 11 ప్రాంతాల (లొకేషన్ల)ను ప్రభుత్వం గుర్తించింది. అందులో 8 చోట్ల నుంచి సర్వీసులు నడిపేందుకు వీలుగా టెక్నో ఫీజిబిలిటీ నివేదిక, డీపీఆర్ తయారీకి టెండర్లు పిలిచింది. తొలి దశలో అమరావతి (ప్రకాశం బ్యారేజి), తిరుపతి (కళ్యాణి డ్యాం), గండికోట నుంచి సర్వీసులు నడిపేందుకు వీలుగా డీపీఆర్ తయారు చేయాలని నిర్ణయించింది. అమరావతి, గండికోట డీపీఆర్ బాధ్యతలు రైట్స్ సంస్థకు, తిరుపతివి ఫీడ్ బ్యాక్ హైవేస్ సంస్థకు అప్పగించింది. ఆయా ప్రాంతాల నుంచి సర్వీసులు నడిపేందుకు ఆసక్తి చూపిన సంస్థలతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. దేశవ్యాప్తంగా 56 మార్గాల్లో సీ ప్లేన్ సేవలు అందించేందుకు సంస్థల ఎంపికకు కేంద్ర పౌర విమానయాన సంస్థ (మోకాఎంఓసీఏ) బిడ్‌లు పిలిచింది. రాష్ట్రంలో 11 లొకేషన్లు ఉన్నా.. ఒకే ప్రాంతానికి రెండు, మూడు దారులు ఉండటంతో 32 మార్గాల (ప్రకాశం బ్యారేజి, గండికోట, తిరుపతి లొకేషన్లు.. తిరుగు ప్రయాణాలతో కలిపి 6 మార్గాల కింద లెక్క)ను గుర్తించింది. వీటికి స్పైస్‌జెట్, ఎయిర్ ఏసియా సంస్థలు సర్వీసులు నడిపేందుకు ఆసక్తి వ్యక్తం చేశాయి. మార్గాల కేటాయింపుపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ఉడాన్ పథకం కింద అందించే సదుపాయాలను సీ ప్లేన్‌లు నడిపే సంస్థలకు వర్తింపజేస్తోంది.

**3 మార్గాలే ఎందుకు?**

తొలిదశలో చేపట్టే 3 మార్గాలకు సమీపంలో విమానాశ్రయాలు ఉన్నాయి. సాధారణ విమాన సర్వీసులతో కలిపి.. సీ ప్లేన్ సేవలు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉదాహరణకు గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రకాశం బ్యారేజిలో ఏర్పాటు చేసిన వాటర్ డ్రోమ్‌కు సర్వీసు నడుపుతుంది. అక్కడ కనకదుర్గమ్మ ఆలయ దర్శనం తర్వాత.. శ్రీశైలం వరకు వెళ్లేలా ప్రతిపాదించినట్లు సమాచారం.

**ప్రభుత్వ లక్ష్యం**

* మారుమూల, పర్యాటక ప్రాంతాలకు విమానయాన సేవలు విస్తరించడం.
* రన్‌వే అందుబాటులో లేని ప్రాంతాలకు విమానయాన సౌకర్యం మెరుగుపరచడం.
* విమానాశ్రయాల నిర్మాణం కంటే తక్కువ ఖర్చు, తక్కువ వ్యవధిలో వాటర్ డ్రోమ్‌ల అభివృద్ధికి అవకాశం.
* పర్యాటక రంగం అభివృద్ధి, విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడం.
* ప్రయోగాత్మక పరిశీలన విజయవంతం

గతేడాది నవంబరు 9న పున్నమి ఘాట్ (ప్రకాశం బ్యారేజి) నుంచి శ్రీశైలం వరకు సీ ప్లేన్‌ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పరిశీలించింది. సుమారు 150 కి.మీ.ల విహారంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు పలువురు అధికారులూ ప్రయాణించారు. అది విజయవంతం కావడంతో రాష్ట్రం నుంచి ఈ సేవలు ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. భూమి ఉపరితలం నుంచి 1,500 అడుగుల ఎత్తులో సీ ప్లేన్ ప్రయాణిస్తుంది. ప్రకృతి రమణీయతను పరిచయం చేసేలా అందులో ప్రయాణం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## 'ధరణి' మారినా అదే తీరు!

(మొదటిపేజీ తరువాయి)

అవస్థలు పడుతున్నారు. ధరణి పోర్టల్ ఉన్నప్పుడు ఈ ఇబ్బందులు ఉండగా.. ఇప్పుడు భూ భారతి వచ్చాక కూడా అదే దుస్థితి కొనసాగుతోంది. సాగు భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, గిఫ్ట్ డీడ్, వారసత్వ బదిలీ, జీపీఏ తదితర లావాదేవీలు గత నెల వరకు ధరణి పోర్టల్ వేదికగా జరిగేవి. స్లాట్ నమోదు చేసుకున్నాక భూమి కొనవద్దనుకునో.. ఆ భూమిపై ఏదైనా వివాదం ఉందనో.. అప్పుడు కాక మరో సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలనో నిర్ణయించుకున్న కొనుగోలుదారు స్లాట్‌ను క్యాన్సిల్ చేసుకునేవారు. కానీ ఆ లావాదేవీ కోసం చెల్లించిన రుసుం వెనక్కు రాలేదు. ఈ మొత్తం రూ.కోట్లలో ఉంది. వేల మంది రైతులు తిరుగు చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఆర్వోఆర్ 2020 రద్దయింది. దాంతోపాటు ధరణి పోర్టల్ కూడా రద్దయింది. ఆ స్థానంలో ఆర్వోఆర్ 2025 (భూ భారతి చట్టం) అమల్లోకి వచ్చింది. ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్ తెచ్చారు. అయినప్పటికీ రద్దు చేసుకున్న లావాదేవీలకు సంబంధించి సొమ్ము మాత్రం పాత పద్ధతిలోనే నిలిచిపోతోంది. తిరుగు చెల్లింపులు రావడం లేదు. భూ యజమానులు... తహసీల్దార్లు, కలెక్టర్ల చుట్టూ తిరుగుతున్నారు.

**మొదట్లో ప్రయత్నాలు జరిగినా...**

2020 నవంబరుకు పూర్వం స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ (కార్డ్ సాఫ్ట్‌వేర్) ద్వారానే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరిగేవి. ఆ సమయంలో లావాదేవీలు రద్దు చేసుకుంటే చెల్లించిన సొమ్మును ఖజానా విభాగం ద్వారా తిరిగి చెల్లించేవారు. ఆ తర్వాత వాటిని ధరణికి... తాజాగా భూ భారతి పోర్టల్‌కు బదలాయించినప్పటి నుంచే రద్దైన లావాదేవీలకు సంబంధించిన సొమ్ము చెల్లించకపోవడమనే సమస్య కొనసాగుతూ వస్తోంది. కొన్ని జిల్లాల్లో మాత్రం కొంత మొత్తాన్ని జిల్లా కలెక్టర్లు ప్రత్యేక ఖాతాల ద్వారా తిరిగి చెల్లించారు. హైదరాబాద్, రంగారెడ్డితోపాటు పలు జిల్లాల్లో కొద్ది కాలం పాటు ఇది జరిగింది. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చాక తిరుగు చెల్లింపులు చేసేందుకు మొదట్లో ప్రయత్నాలు జరిగినా దీనిపై దృష్టిసారించే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం జరిగిందన్న వాదనలు ఉన్నాయి. ఇప్పటికైనా తిరుగు చెల్లింపులను చేయాలని బాధితులు కోరుతున్నారు.

## చేపలు పడుతుంటే.. పోటీలకు పిలుపొచ్చింది

* **మిస్ ఇంగ్లాండ్ ఫస్ట్ రన్నరప్ చార్లెట్ గ్రాంట్**




హైదరాబాద్: తెలంగాణ ఆతిథ్యం తనకు ఎంతగానో నచ్చిందని మిస్ ఇంగ్లాండ్ (ఫస్ట్ రన్నరప్) చార్లెట్ గ్రాంట్ తెలిపారు. పలు వ్యక్తిగత కారణాలతో ప్రపంచ సుందరి పోటీల నుంచి మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ వైదొలిగిన తర్వాత ఆమె స్థానంలో చార్లెట్ గ్రాంట్ వచ్చారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో 'ఈనాడు'తో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. ''హైదరాబాద్ ప్రజల ఆప్యాయత నచ్చింది. వారు స్వాగతించిన తీరు బాగుంది. నేను సందర్శించని ప్రదేశాలను రానున్న రోజుల్లో చూడటానికి ప్రయత్నిస్తా. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేడుకలు, సంబరాలు చూస్తుంటే ముచ్చటేస్తోంది'' అని తెలిపారు. ''నాకు లభించిన ఈ అవకాశం.. అరుదైనది, ప్రతిష్ఠాత్మకమైనది. అలవాటులో భాగంగా పెరట్లో చేపలు పడుతుండగా ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనాలనే సమాచారం వచ్చింది. ఎంతో సంతోషపడ్డాను. ఫ్యాషన్ షోలో తెలంగాణ సంప్రదాయ వస్త్రాలతో పాల్గొనడం కొత్తగా అనిపించింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారి సహాయార్థం.. 'బ్యూటీ విత్ ఎ పర్పస్'లో భాగంగా పెద్దఎత్తున విరాళాలు సేకరించాను. ఇప్పటికే పలు పోటీలు పూర్తయ్యాయి. రానున్న పోటీల్లో వందశాతం కృషి చేస్తా. ఈ పోటీల్లోని ప్రతి సందర్భం జీవితాంతం గుర్తుండిపోయేలా పదిలం చేసుకుంటా'' అని చార్లెట్ గ్రాంట్ తెలిపారు.

## పులే సినిమాను అనువదిస్తే పన్ను మినహాయింపు

* **మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ**



బంజారాహిల్స్ : సామాజిక సంస్కరణలు, సమానత్వం, విద్యావ్యాప్తి, మహిళా సాధికారతకు కృషిచేసిన మహోన్నత ఆదర్శమూర్తి మహాత్మా జ్యోతిరావు పులే అని మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. ఆదివారం హైదరాబాద్.. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో మహాత్మా జ్యోతిరావు పులే హిందీ సినిమాను బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీసంఘాల నేతలతో కలిసి వీక్షించారు. అనంతరం పొన్నం విలేకరులతో మాట్లాడారు. 'సామాజిక సంస్కరణలు, సమానత్వం, మహిళా సాధికారత, విద్యావ్యాప్తి కోసం పులే దంపతులు అమూల్య సేవలందించారు. ఈ సినిమా తెలుగులోకి అనువాదమయ్యేలా ప్రభుత్వం కృషి చేస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఈ చిత్రానికి పన్ను మినహాయింపు ఇచ్చేలా కృషి చేస్తా. విద్యార్థులే భవిష్యత్తు పునాదులు.. వారు మెరుగైన జీవనం సాగించేందుకు వారికి చక్కటి విద్యనందించేలా తల్లిదండ్రులు శక్తిమేరకు ప్రయత్నించాలి. మహిళలు స్వేచ్ఛగా అన్నిరంగాల్లో ముందుకెళ్లేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉంది. తెలంగాణలో చేపట్టిన కులగణనకు స్ఫూర్తి పులే' అని పేర్కొన్నారు. పులే దంపతులకు భారతరత్న ఇవ్వాలని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సామాజికవేత్త కంచ ఐలయ్యలు కోరారు. సినిమాను వీక్షించిన వారిలో ఎంపీలు సురేష్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, శ్రీహరి ముదిరాజ్, వీర్లపల్లి శంకర్, ప్రకాశ్‌గౌడ్, బీసీ సంఘాల నేతలు వకుళాభరణం కృష్ణమోహన్, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

## తుది దశకు వచ్చిన ఇందిరమ్మ ఇళ్లపై దృష్టి

* **2న ఎక్కువ గృహాలు అందించేందుకు కసరత్తు**

హైదరాబాద్: రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న సాధ్యమైనన్ని ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. వారం రోజులే ఉండటంతో శ్లాబ్, గోడలు పూర్తి చేసుకుని తుదిదశలో ఉన్న గృహాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మొదటి విడతలో మండలానికి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి మొత్తం 47,377 మందికి ఇళ్ల నిర్మాణం కోసం అనుమతి పత్రాలు అందించారు. ఇందులో 23,847 మంది పనులను ప్రారంభించారు. వీటిలో తుదిదశకు వచ్చిన ఇళ్లను జూన్ 2 నాటికి పూర్తయ్యేలా చూడాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. అప్పటికి వెయ్యి ఇళ్లనైనా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని భావించింది. క్షేత్రస్థాయిలో నిర్మాణ ఖర్చు ఎక్కువగా అవుతుండడం, ప్లంబింగ్, వైరింగ్ వంటి పనులకు సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన పేదల పక్షపాతి కేసీఆర్

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, ప్రజాస్పూర్తి : నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన పేదల పక్షపాతి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధి కైసర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల వద్ద 2బి.హెచ్.కె డిగ్నిటీ హౌసింగ్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాణా సంచా కాలుస్తూ, గజామలలతో ఎమ్మెల్యే ని ఘనస్వాగతం పలుకుతూ పండుగ వాతావరణంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ దాదాపు 50 60 లక్షల విలువ గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిరుపేదలకు అందించిన ఘనత పెద్దలు కేసీఆర్ కే దక్కుతుందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు బేధాభిప్రాయాలు వీడి ఒక్కతాటిపై ఉండి సమస్యలు లేని సముదాయంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలను ఆదర్శవంతమైన సముదాయంగా నిలుపాలన్నారు. 2 బి.హెచ్.కే ఇళ్ల సముదాయాలలో నెలకొని ఉన్న సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని, రానున్న రోజుల్లో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, సమ్మయ్య యాదవ్, చెట్ల వెంకటేష్, దూలప్ప, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, సాయిబాబా, మహేష్, శివ నాయక్, నవీన్, ఆసిఫ్, ప్రసాద్, మహిళా నాయకురాలు మామి, 2బి.హెచ్.కె డిగ్నిటీ హౌసింగ్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు సాదుల వేణు, సలహాదారులు ఎస్.కె.సాజిద్, ఉపాధ్యక్షులు ఎం.డి. అతిక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.వలీ, కోశాధికారి బింగి యాదగిరి, ఖాసీం, పి.వి.రావు, మనోహర్, శంకర్ గౌడ్, ఎండి. షాబాద్, హర్ష, కృష్ణ, హిరణ్య కుమార్, ప్రసాద్, నర్సింగ్ రావు, రజాక్, బాబు రెడ్డి, ఎండి. అంజాద్ ఖాన్, వంశీ, సత్యా రావు, ప్రమీల, లక్ష్మీ, శ్రీనివాస్, బ్రహ్మ నాయుడు, లోకేష్, కృష్ణ రాజ్, అంజి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అమ్మవారి పరాయణం



జిన్నారం, ప్రజాస్పూర్తి 25: జిన్నారం మండలం జంగంపేట రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అఖండ శ్రీ లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు అమ్మవారి సహస్ర నామాన్ని పదకొండు సార్లు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకట రెడ్డి, ఆలయ పూజారి శ్రీనివాస భార్గవ అన్ని ఏర్పాట్లను చేశారు. కార్యక్రమానికి అంగడిపేట మహరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలను చేశారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని సహస్ర నామార్చనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చిమ్ముల



జిన్నారం, ప్రజాస్పూర్తి 25: జిన్నారం మండలం మంగంపేట మాజీ ఉపసర్పంచ్ నక్క నాగరాజు మాతృమూర్తి లక్ష్మీబాయి, అదేవిధంగా ఇటీవల పెద్దమ్మ గూడెంకు చెందిన కొమరయ్య ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. విషయాన్ని తెలుసుకొని వారి కుటుంబాలను పరామర్శించారు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీటీసీ వెంకటేష్ గౌడ్, సింహారెడ్డి, బండి శ్రీకాంత్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, ఖదీర్, నరేందర్, మోహన్, కత్తుల రవి, లక్ష్మణ్, శ్రీకాంత్ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీసేవ నిర్వాహకుల నూతన కమిటీ



ప్రజా స్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజ్ లో జరిగిన మీసేవ నిర్వాహకుల ఆత్మీయ సమ్మేళనానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అందరూ మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు .. ఇందులో భాగంగా భద్రాద్రి జిల్లా మీసేవ నిర్వాహకులు తమ జిల్లా యూనియన్ ని తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర యూనియన్ లో విలీనం చేయడం విశేషం. అందులో భాగంగా భద్రాద్రి జిల్లా మీసేవ ఫెడరేషన్ నూతన కమిటీ ని ఏర్పాటు చేశారు. కాగా ఈ కార్యక్రమానికి తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు భైర శంకర్, రాష్ట్ర మీసేవ నాయకులు పాల్గొన్నారు. వీరితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా మీసేవ నాయకులు కూడా హాజరయ్యారు. తెలంగాణ మీసేవ ఫెడరేషన్ భద్రాద్రి జిల్లా కమిటీ కి ప్రెసిడెంట్ గా కె. నరేష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ గా భూక్యా రంజిత్ నాయక్ , వెలమ రాజేందర్. జనరల్ సెక్రటరీ గా బెల్లంకొండ రామారావు,ట్రెజరర్ గా మీసేవ ప్రసాద్, మరికొంత మంది నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె. పి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్పూర్తి) : మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేసిన గొప్ప నాయకుడు బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె. పి.వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ వెన్నెల గడ్డలోని ఎఫ్.సి.ఎస్ కన్వెన్షన్ నందు నిర్వహించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, జీడిమెట్ల శాఖ 5వ సర్వసభ్య సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో చెరువులకు జీవం పోస్తూ మత్స్యకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ఆర్థికాభివృద్ధిని అందించాలన్నారు. జీడిమెట్ల డివిజన్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఫిషరీస్ కో అపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డిస్టిక్ ఫిషరీస్ ఆఫీసర్ సుకీర్తి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జీడిమెట్ల శాఖ అధ్యక్షులు చిలుకూరి కృష్ణ, ఉపాధ్యక్షురాలు చిలుకూరి యాదమ్మ, ప్రధాన కార్యదర్శి మద్దూరి వీరేష్, డైరెక్టర్లు తాళ్ల వెంకటేష్, మన్నె శంకర్, అరికల లక్ష్మణ్, మద్దూరి సత్తెమ్మ, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్ల భరోసా

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
- **491 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉత్తర్వులు అందజేత**



ప్రజాస్పూర్తి, ముస్తాబాద్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం భరోసాగా నిలుస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ముస్తాబాద్ మండలంలో రెండో విడత క్రింద 491 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉత్తర్వులను ఆదివారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి స్థలం, భూమి పత్రాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 3500 ఇందిరమ్మ ఇండ్లకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని వెల్లడిరచారు. ముస్తాబాద్ మండలంలో 491 మంది లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం చేసుకోవాలని స్పష్టం చేశారు. 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడిరచారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు,ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి వంటి చేయాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే ఫోన్ చేయాలని సూచించారు. ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ఇసుక మండల కేంద్రాలలో అందుబాటులో పెడతామని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఒక్కో దశలో అవసరమైన ఇసుక కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందని వెల్లడిరచారు. రవాణా ఛార్జీలు చెల్లించాలని కలెక్టర్ సూచించారు. 30 రోజుల లోగా నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించని పక్షంలో మంజూరు చేసిన ఇండ్లు రద్దు అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ తలారి రాణి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, పిడి హౌసింగ్ శంకర్, డిఆర్‌డిఓ శేషాద్రి, ఎంపిడిఓ బీరయ్య, తహశీల్దార్ సురేష్, సంబంధిత అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్.ఎస్.కె. సమాజ్ ఉపనయనం కార్యక్రమం...



కుత్బుల్లాపూర్, ప్రజాస్పూర్తి : కూకట్ పల్లి వివేకానంద్ నగర్ లోని చిత్తారమ్మ ఆలయంలో ఆదివారం ఎస్.ఎస్.కె. సమాజ్ ఉపనయన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.ఎస్.ఎస్.కె. సమాజ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు మెట్ల శ్రీను, జయకృష్ణ, ఎస్.ఎస్.కె. సమాజ్ అధ్యక్షులు హనుమంత్ రావు, ఉపాధ్యక్షులు బి.రఘు, ప్రధాన కార్యదర్శి డి.మాణిక్, సంయుక్త కార్యదర్శి డి.నాగేందర్, కోశాధికారి జి.శివ, సంయుక్త కోశాధికారి జే. లక్ష్మి నారాయణ ,సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిభిరాలను నిరుపేద ప్రజలకు ఎంతగానో ఉపయోగం

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే. పి .వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్పూర్తి : ఉచిత వైద్య శిభిరాలను నిరుపేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతాయని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే. పి .వివేకానంద్ అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ మహా నగర్ ఎస్టేట్స్ నందు "గ్రేస్ ఫౌండేషన్" ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలు అత్యధికంగా నివసించే బస్తీలలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరాలను అవసరమున్న ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో లైట్ ఆఫ్ లైఫ్ పాస్టర్ డేవిడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, నరేందర్ రెడ్డి, యేసు, ఆటో బలరాం, నారాయణ, విజయ్ హరీష్, మహా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కుమార్, సలహాదారులు ముద్దాపురం శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, కోశాధికారి ధర్మయ్య, సంయుక్త కార్యదర్శి వినోద్, కాలనీ వాసులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

జగద్గిరిగుట్ట ప్రజాస్పూర్తి : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్ బస్తీ లోని శ్రీ పాతాలేశ్వర్ హనుమాన్ దేవాలయం నందు నిర్వహించిన "హరే రామ హరే కృష్ణ" జప కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు మెట్ల శ్రీను, జైహింద్, ముంతాజ్, శ్రీ పాతాలేశ్వర్ హనుమాన్ దేవాలయం కమిటీ సభ్యులు నందు గుప్తా, జితేందర్ పటేల్, సురేంద్ర యాదవ్, రాజ్ కుమార్, రాజు పటేల్ తదితరులు పాల్గొన్నారు.



# మతోన్మాద కార్పోరేట్ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు

*** సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద కార్పొరేట్ ఆర్థిక అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న సిపిఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులలో భాగంగా వర్తమాన రాజకీయాలు అంశంపై క్లాసు బోధిస్తూ ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జరుగుతున్న ప్రతి పరిణామాన్ని మత విద్వేశంతో తనకు అనుకూలంగా మలుచుకుంటూందని ఆరోపించారు. మతం పేరుతో విభజన సృష్టించి ప్రజల మధ్య మతవైస్యమ్యాలు రెచ్చగొట్టి తమకు ప్రీతిపాత్రులైన కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెడుతోందని విమర్శించారు. ప్రజలు ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించకుండా సెంటిమెంట్ అంశాన్ని ముందుకు తీసుకొచ్చి సమస్యను పక్కదో పాటించడంలో బిజెపికి సాటి మరి ఎవరు లేరని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం ధరలు పెరుగుదల వంటి సమస్యలు ముందుకొచ్చి ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న ప్రభుత్వానికి ఇవేమీ పట్టనట్లుగా కార్పొరేట్ల లాభాల గురించి తప్ప మరే ఇతర అంశాల గురించి ప్రభుత్వం ఆలోచించడం లేదని విమర్శించారు. శత్రుదేశం అయిన పాకిస్తాన్ తో చర్చలు జరిపి యుద్ధం ఆపడానికి నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఈ దేశ పౌరులైన మావోయిస్టులు కేంద్రంతో చర్చలు జరపడానికి తమ సిద్ధమేనని ప్రకటించినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను హత్య గావిస్తోందని ఈ ఉన్మాదపు చర్య అని ఆయన విమర్శించారు. 2026 నాటికి మావోయిస్టులను అంతం చేస్తానని అమిత్ షా ప్రకటించడం సమస్యను మరింత జటిలం చేసేదిగా ఉందని ఆరోపించారు. నక్సలిజం పుట్టుకకు కారణమైన పరిస్థితులను నాశనం చేయకుండా ప్రశ్నించే గొంతులను ప్రజల తరఫున పోరాడే గొంతులను నాశనం చేయడం అది ఎప్పటికీ సాధ్యం కాదని ఆయన అన్నారు. మావోయిస్టులను కాల్చి చంపడం మోదీ అమిత్ షాల నిరంకుశ విధానాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. పాకిస్తాన్ తో యుద్ధం విరమణ కు సంబంధించిన అంశాలను ప్రత్యేక పార్లమెంటును ఏర్పాటు చేసి ప్రజలకు వాస్తవాలు తెలియచేయాలని ఆయన డిమాండ్ చేశారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని ట్రంప్ చేతిలో పెట్టారని మోడీ ప్రభుత్వం అమెరికాలో ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కాశ్మీర్ సమస్యను భారత్ పాకిస్తాన్ ప్రభుత్వాలు శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాలని ఇతర దేశాలు తలదూర్చకుండా సమస్య పరిష్కారం చేయాలని ఆయన సూచించారు. ఆర్టికల్ 370 రద్దుతో కాశ్మీర్ అభివృద్ధి చెందుతుందని ఉగ్రవాదం నశిస్తుందని కల్లబొల్లి మాటలు చెప్పిన మోడీ ప్రభుత్వం కాశ్మీరును ప్రశాంత కాశ్మీరుగా అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఏడాది కాలంలోనే ప్రజల అసంతృప్తికి గురైందని అన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించిన 6 గ్యారంటీల అమలులో వైఫల్యం చెందిందని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏ ఒక్క పథకము పూర్తిగా అమలు కాలేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కాంగ్రెస్ కార్యకర్తల జేబు పథకంగా మారకుండా నిజమైన అర్హులకు ఇల్లు మంజూరు చేయాలని లేని పక్షంలో ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రైతాంగానికి వ్యవసాయ కార్మికులకు మహిళలకు ఇచ్చిన హామీలు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించాలని ఇది కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్న అంశమేనని గుర్తు చేశారు. రాష్ట్రం అప్పుల పాలైన సంగతి కాంగ్రెస్కు ఎన్నికల ముందు తెలియదా అని ప్రశ్నించారు. ఏ పథకాన్ని అమలు చేయమని అడిగిన ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని చెప్పడం సరైనది కాదని ఉన్న ఆర్థిక వనరులను ఉపయోగించి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండి ప్రజలను పోరాటాల్లో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. ఐదు రోజులపాటు జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులకు సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెర పాటి పుల్లయ్య ఎంబి నర్సారెడ్డి కే బ్రహ్మాచారి కారం పుల్లయ్య లిక్కి బాలరాజు అన్నవరపు సత్యనారాయణ రేపాకుల శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఏ నబి దొడ్డ రవికుమార్ జీలకర్ర పద్మ భూక్య రమేష్ చిలకమ్మా వీర్ల రమేష్ యాస నరేష్ అర్జున్ రాంబాబు గద్దల శ్రీను సాంబశివ మోరంపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.




## కేశిరెడ్డి కేశవరెడ్డి మృతి తీరని లోటు

*** పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి**



శేర్లింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : కేశిరెడ్డి కేశవరెడ్డి మృతి తీరని లోట అని పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి అన్నారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్గా విధులు నిర్వహించిన కేశిరెడ్డి కేశవ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణంలోని కమిటీ హాల్ ముందుగల (రోడ్ నెంబర్ 15 సి బ్లాక్) లో సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సంతాప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేశవరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి కేశవరెడ్డి చేసిన సేవలను కొనియాడుతూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలోని శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయం ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో , బస్తీ వెల్ఫేర్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భగవంతు రెడ్డి .క్యాషియర్ నరసింహులు .కె.వి. రాజు. ఏ భూపాల్ రెడ్డి.జి లక్ష్మీకాంత్ రెడ్డి. ఏ ప్రభాకర్. హనుమంత రెడ్డి. తిరుపతిరెడ్డి .తాటి కిరణ్ .శంకర్ రెడ్డి. రాజయ్య .వనం ఆంజనేయులు. మల్లేష్ మేస్త్రీ. శంకర్ రెడ్డి. మోహన్ రెడ్డి. ఐలయ్య. భాస్కర్ గుప్తా. ఎస్ నర్సిరెడ్డి. శ్రీకాంత్ రెడ్డి .చారి. మహేందర్ రెడ్డి. కరుణాకర్ రెడ్డి .శివ గౌడ్. రాము .కృష్ణారెడ్డి. శరత్ రెడ్డి .టి ఆంజనేయులు. మల్లికార్జున్. జగన్మోహన్ రెడ్డి. లక్ష్మి. అరుణ. ఇతర పెద్దలు బస్తీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఐ కమిషనర్ కు మొక్కను అందించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నూతనంగా ఆర్టిఐ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ఆర్టిఐ పీవీ శ్రీనివాసరావు ను సింగరేణి గెస్ట్ హౌస్ నందు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్. మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

## అల్పపీడన ప్రభావం.. 3 రోజుల పాటు తెలంగాణకు వర్ష సూచన

హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు ఇవాళ దేశంలోని పలు ప్రాంతాలకు విస్తరించాయి. పశ్చిమ మధ్య, తూర్పు మధ్య అరేబియా సముద్రంతో పాటు కొన్ని ప్రాంతాలకు, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు, గోవా అంతటా, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, మిజోరాంలోని కొన్ని ప్రాంతాలు, మణిపూర్, నాగాలాండ్లోని కొన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలకు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరఠ్వాడ, ఉత్తర అంతర్గత కర్ణాటక వద్ద ఉన్న అల్పపీడనం ఇవాళ ఐఎస్టీ వద్ద కొనసాగుతోందని పేర్కొంది. ఇది రాబోయే 24 గంటల్లో నెమ్మదిగా తూర్పు వైపునకు కదిలి క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. దీని ప్రభావంతో రాగల మూడు రోజులు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.



# సమాచార హక్కు చట్టం వజ్రాయుధం..

*** తెలంగాణ ఆర్టిఐ కమిషనర్.. పి. వి శ్రీనివాస్.**

ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధంలా పనిచేస్తుందని దీనిని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని తెలంగాణ ఆర్టిఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి లోని ఎస్ ఎస్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జర్నలిస్టులు , ఆత్మీయుల ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ పౌర సన్మాన సభకు పివి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. పీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ పేపర్ బాయ్ స్థాయి నుంచి ఈరోజు తెలంగాణ సమాచార హక్కు కమిషనర్ గా సాగిన సుదీర్ఘ ప్రయాణాన్ని ప్రస్తావించారు . ఎన్నో సమస్యలతో ఎవరికీ చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో 50శాతం జనాభా నేటికీ ఉన్నారనేది వాస్తవం అని అన్నారు . సామాన్యుడి గళానికి దక్కిన గౌరవమే ఈ సమాచార శాఖ ఆర్టిఐ కమిషనర్ పదవి అని సామాన్యుడు నుంచి సమస్యలు తీరే వరకు జవాబుదారీగా ఉంటూ ప్రజలందరికీ అందుబాటులో సమాచార హక్కు చట్టాన్ని తీసుకువస్తానని అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో సమాచార హక్కు చట్ట కమిషనర్ గా ఇచ్చిన పదవీ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ప్రభుత్వానికి పేరు తీసుకువస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ శ్రీనివాస్ సతీమణి సృజన మాట్లాడుతూ అట్టడుగు స్థాయి నుండి నేడు ఆర్టిఐ కమిషనర్ గా పదవీ బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉంది అంటూనే కుటుంబ బాధ్యతలకు సమయం కేటాయించలేదేమో అనిపిస్తుందని అన్నారు. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీనివాస్ పై ఉన్న నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి జవాబుదారీగా ఉంటారని నమ్మకం ఉందని ఉద్యమం నేపథ్యం కలిగిన శ్రీనివాస్ పదవికి వన్నె తీసుకొస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యమ సహచరుడిగా శ్రీనివాస్ అంతరంగాన్ని తెలియజేస్తూ ఆ చల్లని సముద్ర గర్భం అంటూ సృజన పాడిన పాట సభికులందరినీ ఉత్సాహపరిచింది. ఈ సందర్భంగా ప్రముఖ విద్యాసంస్థల అధినేతలు, వ్యాపారస్తులు జర్నలిస్టులు ఇతర వర్గాల ప్రజలు పివి శ్రీనివాస్ ఆత్మీయులు ఈ ఆత్మీయ సభలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కమిషనర్ గా తెలంగాణ రాష్ట్రంలో సరైన వ్యక్తికి ఉద్యమ నాయకుడికి దక్కిన గౌరవం అని అన్నారు. అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పీవీ శ్రీనివాస్ పేరు తెలియని వారు లేదంటే అతిశయోక్తి కాదని మాట్లాడారు. అటు కేసీఆర్ హయాంలో అలుపెరుగని పోరాట ధీరుడుగా ఒకపక్క నికార్సైన జర్నలిస్టుగా విధులు నిర్వహిస్తూనే తెలంగాణ ఉద్యమానికి తిరుగులేని పాత్ర పోషించారు.. ఐజెయు జాతీయ నాయకులు దుద్దుకూరి రామారావు అధ్యక్షత వహించి పీవీ శ్రీనివాస్ తో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. టియుడబ్ల్యూజే ఐ జే యు జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టు కుటుంబం నుంచి వచ్చిన పీవీ శ్రీనివాస్ భద్రాద్రి రామయ్యనే ఎవడబ్బ సొమ్మనీ కులుకుతూ తిరిగేవు రామచంద్ర అంటూ ఎదిరించి మాట్లాడిన కంచర్ల గోపన్నలా సమాజం కోసం పోరాటం చేశారని ధిక్కరించిన స్వరానికి దక్కిన గౌరవమే ఆర్టిఐ కమిషనర్ పదవి అని అన్నారు. టీజేఎఫ్ అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల పక్షాన నిలిచిన వ్యక్తికి సరైన గౌరవం దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, కోనేరు చిన్ని, సింగరేణి ఎడ్యుకేషన్ సెక్రటరీ గుండా శ్రీనివాస్, టీబీజీకేఎస్ మాజీ అధ్యక్షులు ఆకునూరి కనకరాజు, మధువన్ వ్యాపార సంస్థల అధినేత కాకొల్లు నాగేశ్వరరావు, బిజెపి నాయకులు జీవీకే మనోహర్, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు మల్లెల రామనాథం, సీనియర్ నాయకులు మేరెడ్డి జనార్ధన్ రెడ్డి, విద్యాసంస్థల అధినేతలు జేవిఎస్ చౌదరి, మాచవరపు కోటేశ్వరరావు, చైతన్య కృష్ణ, భరత్, సింగరేణి ఎస్సీ సెల్ నాయకులు అంతటి నాగేశ్వరరావు, సింగరేణి లైసన్ ఆఫీసర్ కలువల చంద్రశేఖర్, రుద్రంపూర్ జేఏసీ నాయకులు యాకయ్య, అనుదీప్, పొగరు రాజశేఖర్, బండి రాజు గౌడ్ , కోదాడ శ్రీనివాసరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు చంద్ర నరసింహారావు, వట్టి కొండ రవి, ఏర్పుల సుధాకర్ రావు, ఎర్రా ఈశ్వర్, సీనియర్ పాత్రికేయులు ఎండి వాహబ్, గుణ సురేష్ ,లక్కీ లక్ష్మణ్, అశోక్, వీరు నాయక్, క్రాంతి కుమార్, నాగేశ్వరరావు, కోలా కుమార్, జంపన్న, మురళి, పురం శ్రీనివాస్, జాన్సన్ బాబు, రత్న కుమార్ , లక్ష్మణరావు, పురుషోత్తం, కంచు శ్రీను, వినోద్, రామారావు, గీత మధు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు భారత సైనికులకు సన్మానం





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భారత్ పాకిస్తాన్ల మధ్య ఉద్రిక్త వాతావరణంలో దేశ సరిహద్దులో సైనిక సేవలు అందించిన ముస్తాబాద్ మండలం బంధనకల్ గ్రామానికి చెందిన భారత సైనికులు శరత్, ధర్మపురిలకు బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో ఆదివారం చిరు సన్మానం చేశారు. దేశం కోసం సైనికుల సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతి కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్ రెడ్డి, బుచ్చెల్లి మహేశ్వరీ, చీకోటి మహేష్, కార్తీక్ రెడ్డి, కాసోడి రమేష్, వంతడుపుల సుధాకర్, కొంపల్లి రాజేందర్, సందేవేని రాజు, సిరిసిల్ల వంశీ, బూత్ అధ్యక్షులు చల్ల శ్రీకర్ రెడ్డి, కస్తూరి గాలిరెడ్డి తదితరులున్నారు.

## గ్రామ పాలనాధికారుల నియామక పరీక్ష కేంద్ర్రాన్ని పరిశీలిచిన జిల్లా కలెక్టర్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా కేంద్రంలోని ఆదివారం కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ సింగరేణి పాఠశాలలో నిర్వహిస్తున్న గ్రామ పాలనాధికారుల నియామక పరీక్ష కేంద్రాన్ని పరిశీలిచిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

## ప్రణాళిక బద్దంగా అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తా బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ .వివేకానంద్

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలను ప్రణాళిక బద్దంగా, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పరుస్తామని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ .వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్ "వీనస్ రాక్స్ హైట్స్" నందు దాదాపు రూ.36.80 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.



గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్నీ ప్రాంతాలలో మౌలిక వసతులను కల్పించామన్నారు.ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, చెట్ల వెంకటేష్, తెలంగాణ సాయి, చిన్నా చౌదరి, సమ్మయ్య యాదవ్, బాబీ చౌదరి, దూలప్ప, శివా నాయక్, జునైద్, ఆసిఫ్, ప్రసాద్, వీనస్ రాక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వీసీ. వేమా రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీధర్ రెడ్డి, సలహాదారులు శివరాం ప్రసాద్, శంకర్ రెడ్డి, మధు, సంయుక్త కార్యదర్శి బాల నాగ దుర్గా, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి శిఖా గోయల్, ఐపీఎస్ రెమా రాజేశ్వరి, సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టింది. మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లను అడిగి పోటీల నిర్వహణ తీరు, ఏమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణల్లో ఏ మేరకు నిజం ఉందన్న వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. వీడియోలను సైతం రికార్డు చేస్తుండటం గమనార్హం. దేశ పరువు, ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కావడంతో సీఎం నేరుగా ఎప్పటికప్పుడు విచారణ వివరాలను అడిగి తెలుసుకుంటున్నట్లు సమాచారం. కంటెస్టెంట్‌లతోపాటు.. మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ నుంచి సైతం పోటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లా మాగీ పాల్గొన్న



డిన్నర్‌లో ఎవరెవరు పాల్గొన్నారు, ఆరోజు ఆమెతో కూర్చున్న వారి పేర్లతో పాటు పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

**మిల్లా మాగీ ఆరోపణలివే..**

'హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలనడంతో ఎంతో ఒత్తిడికి గురయ్యా' అంటూ మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణపై గౌరవం పెరిగిందని, అతిథ్యం బాగుందని మెచ్చుకుంటూనే మేం పోటీలకు వచ్చామో, దేనికొచ్చామో అర్థం కాలేదు.. ఇదేం పోటీలని పేర్కొన్నారు. ప్రపంచ సుందరి 2025 పోటీల నుంచి అర్ధాంతరంగా వైదొలిగిన ఆమె ఇంగ్లాండ్ చేరిన తర్వాత చేసిన ఈ వ్యాఖ్యల్ని బ్రిటిష్ మీడియా ప్రచురించింది. ఈ కథనాలను మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో జూలియా మోర్లే ఖండించారు. ఆ వాదనలు నిరాధారమైనవని పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సైతం తోసిపుచ్చారు.

## మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయించాలి: కేటీఆర్



హైదరాబాద్: మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉందన్నారు. తాము మహిళలను గౌరవిస్తామని, వారి వృద్ధికి సమాన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. మహిళలకు అవమానం జరిగితే ఈ రాష్ట్రం అంగీకరించదని పేర్కొన్నారు. ఆడపిల్ల తండ్రిగా ఇలాంటి అనుభవాలు జరగకూడదని కోరుకుంటానని చెప్పారు.

# కవిత లేఖ.. కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ



సిద్దిపేట: భారాస అధినేత కేసీఆర్‌తో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ప్రత్యేకంగా కలిశారు. ఎమ్మెల్సీ కవిత లేఖ, అనంతర వ్యాఖ్యలు, సంబంధిత పరిణామాలు, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ రెండో తేదీన నిర్వహించబోయే కార్యక్రమాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఇటీవల కేసీఆర్‌కు, ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత అంతర్గతంగా లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఆ లేఖ బహిర్గతం కావడం, ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ 'కేసీఆర్ దేవుడు.. కానీ, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి' అంటూ వ్యాఖ్యానించడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్, కేటీఆర్ భేటీ అయినట్లు సమాచారం. జూన్ 1న అమెరికాలోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు కేటీఆర్ ఈ నెల 28న వెళ్లనున్నారు. ఈలోగా పార్టీ పరంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణపై కార్యాచరణ రూపొందించేందుకు వీలుగా కేసీఆర్‌తో ఆయన చర్చించే అవకాశముంది.



## సరస్వతి పుష్కరాలకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

జయశంకర్ భూపాలపల్లి: తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కాళేశ్వరానికి చేరుకున్నారు. హెలికాప్టర్‌లో కుటుంబ సమేతంగా సరస్వతి పుష్కరాలకు వెళ్లారు. ఆయనకు మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు స్వాగతం పలికారు. త్రివేణి సంగమం వద్ద గవర్నర్ దంపతులు పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ.. 3 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు సరస్వతి పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. పుష్కరాలు ముగింపు దశకు రావడంతో భారీగా తరలివస్తున్నారు. కాళేశ్వరం నుంచి సిరోంచ బ్రిడ్జి వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. నేడు 5 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

## అన్న ఆధిపత్యాన్ని సవాల్ చేయడమే కవిత లక్ష్యం

**: భాజపా ఎంపీ లక్ష్మణ్**



దిల్లీ: భారాసలో ఎలాంటి కోటరీ ఉందో ఎమ్మెల్సీ కవిత (MLC Kavitha) వ్యాఖ్యలను బట్టి తెలుస్తోందని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ (MP Laxman) అన్నారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''కేసీఆర్‌ను (KCR) స్వయంగా కుమార్తెనే కలిసే పరిస్థితి లేదని తెలుస్తోంది. కేటీఆర్‌ను (KTR) సవాల్ చేస్తున్నట్లు కవిత లేఖ, వ్యాఖ్యలు ఉన్నాయి. కేటీఆర్ నాయకత్వాన్ని అంగీకరించేది లేదని ఆమె చెప్పకనే చెప్పారు. అన్న ఆధిపత్యాన్ని సవాల్ చేయడమే కవిత లక్ష్యమని తెలుస్తోంది. ఆమె లేఖలో కాంగ్రెస్‌పై ప్రేమ, భాజపాపై ద్వేషం కనిపిస్తోంది. సామాజిక తెలంగాణ గురించి ఆమె మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలను పదేళ్లు పట్టించుకోని వారు ఇప్పుడు మాట్లాడుతున్నారు'' అని లక్ష్మణ్ విమర్శించారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ 'కీ' విడుదల



జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ప్రాథమిక 'కీ'ని ఐఐటీ కాన్పూర్ అధికారులు రిలీజ్ చేశారు. పేపర్ 1, 2 ప్రశ్నాపత్రాలతో కూడిన ఆన్సర్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. మే 27వ తేదీ వరకు విద్యార్థులు కీ పై అభ్యంతరాలు తెలియజేయవచ్చు. వచ్చే నెల(జూన్) 2వ తేదీన ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ నెల(మే) 18న రెండు సెషన్లలో ఈ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షకు 2 లక్షల మంది వరకు హాజరయ్యారు. కీ కోసం https://jeeadv.ac.in/ ఇక్కడ క్లిక్ చేయండి. ఇదిలా ఉంటే.. ఈ నెల(మే) 22న జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష రెస్పాన్స్ షీట్లు విడుదలైన సంగతి తెలిసిందే. దేశంలోని ప్రతిష్ఠాత్మక 23 ఐఐటీల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్ష నిర్వహించారు.

## జపాన్‌ను అధిగమించిన భారత్.. వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో మనం ఇప్పుడు ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నామని కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వివరాలు తెలిపారు. 4 ట్రిలియన్ డాలర్లతో జపాన్‌ను అధిగమించి భారత్ 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, త్వరలో జర్మనీని కూడా అధిగమించనుందని తెలిపారు. మనకంటే ముందు స్థానంలో అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. రాబోయే రెండు సంవత్సరాలలో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ కూడా అంచనా వేస్తోందని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ 2025 లో 6.2 శాతం, 2026 లో 6.3 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేయడం జరిగిందని వెల్లడించారు. ఇది ప్రపంచంలో, ప్రాంతీయంగా మనతో పోటీ పడే దేశాల కంటే ఎక్కువ అని తెలిపారు. ఐఎంఎఫ్ ప్రపంచ ఆర్థిక వృద్ధిని 2025లో 2.8 శాతంగా, 2026 లో 3.0 శాతంగా అంచనా వేసిందని వెల్లడించారు.

## మెడికల్ షాపులపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ కొరడా



తెలంగాణని మెడికల్ షాపులపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ కొరడా ఝుళిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులపై తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు పాటించని వాటిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940, డ్రగ్స్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ 2013, డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ యాక్ట్ 1954 చట్టాల ప్రకారం.. మందుల నాణ్యత, సరైన ధరలు, ప్రిస్క్రిప్షన్ లేకపోయినా విక్రయాలు, నకిలీ మందులు, అక్రమ నిల్వలను నియంత్రిస్తూ ఈ దాడులు నిర్వహిస్తున్నారు.

## కవిత లేఖతో బీఆర్ఎస్ కు నష్టం

**: జగ్గారెడ్డి**



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేసీఆర్‌కు రాసిన ఆరు పేజీల చేతితో రాసిన లేఖ ఇంకా రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తూనే ఉంది. అయితే ఈ లేఖపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. నేడు వరంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కవిత లేఖ వల్ల కాంగ్రెస్ కు వచ్చిన నష్టం ఏమీ లేదని స్పష్టం చేశారు. 2023 శాసనసభ ఎన్నికల్లో 64 సీట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో బలంగా ఉందని.. అలాంటి లేఖలు వంద పుట్టుకొచ్చినా తమకు జరిగే ఏమీ లేదని, ఈ గొడవ వల్ల గులాబీ పార్టీకే తీరని నష్టమని స్పష్టం చేశారు. కవిత లేఖ బీఆర్ఎస్‌లో కేసీఆర్ కుటుంబ "పంచాయితీ"ని బయటపెట్టిందన్న జగ్గారెడ్డి.. కొడుకు కేటీఆర్ ఉండగా వారసత్వం కూతురుకు ఎలా దక్కుతుందని వ్యాఖ్యానించారు. ఈ లేఖ ద్వారా బీఆర్ఎస్ బీజేపీతో రహస్య ఒప్పందాలు బయటపడ్డాయని ఆరోపించారు. ఈ వివాదం తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణాన్ని కల్పించిందని జగ్గారెడ్డి నొక్కిచెప్పారు.

# ఆ రాష్ట్రాల అనుభవాలు వింటుంటే అద్భుతంగా ఉంది : ప్రధాని మోదీ ట్వీట్

దిల్లీ: ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో దిల్లీలో జరిగిన సమావేశం ముగిసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా వారితో కలిసి దిగిన ఫొటోను షేర్ చేసిన ఆయన ఈ కీలక భేటీలో చర్చించిన అంశాల సారాంశాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ''దిల్లీలో ఎన్డీయే సీఎంల కాంక్లేవ్‌లో పాల్గొన్నా. అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించాం. నీటి సంరక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, అడ్మినిస్ట్రేటివ్ ఫ్రేమ్‌వర్క్‌లను బలోపేతం చేయడం, విద్య, మహిళా సాధికారత, క్రీడలు, తదితర విభిన్న రంగాల్లో చేపడుతున్న ఉత్తమ పద్ధతులను ఆయా రాష్ట్రాలు ప్రదర్శించాయి. ఈ అనుభవాలను వినడం చాలా అద్భుతంగా ఉంది'' అన్నారు. దేశాభివృద్ధికి ఊతం ఇవ్వాల్సిన కీలక ఆవశ్యకతను గుర్తు చేసిన ప్రధాని.. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు చేపట్టే పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చూడాలని సూచించారు. ఈ భేటీలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ, యువత సాధికారత, వ్యవసాయం, సాంకేతికత వంటి కీలక రంగాల్లో బలమైన వ్యవస్థను నిర్మించడంపై మాట్లాడినట్లు పేర్కొన్నారు.

*** ఉత్తమ పాలనా పద్ధతులు అవలంబించండి: ప్రధాని సూచన**

తమ ప్రభుత్వం చేపట్టనున్న కుల గణన దేశంలో వెనుకబడిన, అణగారిన వర్గాలను అభివృద్ధి దిశగా తీసుకొచ్చేందుకు ఓ కీలక అడుగు అని ప్రధాని మోదీ (PM Modi) అన్నట్లు సమాచారం. 'ఆపరేషన్ సిందూర్' విజయం దేశం స్వావలంబన దిశగా సాధించిన విజయాలను పునరుద్ఘాటించిందని, ఇది దేశీయ




రక్షణ సాంకేతికత కచ్చితత్వాన్ని చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ఉత్తమ పాలనా పద్ధతులను అవలంబించాలని ప్రధాని సూచించారు. ఈ భేటీ అనంతరం భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు. 'ఎన్డీయే కూటమి కుల రాజకీయాలను నమ్మదు.. కానీ, కుల గణన వివిధ రంగాలలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుంది' అని పేర్కొన్నారు. ఈ భేటీలో సాయుధ బలగాల ధైర్యసాహసాలను, ప్రధాని మోదీ నాయకత్వ పటిమను ప్రశంసిస్తూ నేతలంతా తీర్మానం చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై తీర్మానాన్ని రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, శివసేన నేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే ప్రతిపాదించగా.. కులగణనపై తీర్మానాన్ని హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ ప్రతిపాదించారు. ఆపరేషన్ సిందూర్ భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. మోదీ సాయుధ బలగాలకు మద్దతు ఇచ్చారంటూ ఆయన నాయకత్వాన్ని ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్.. ఉగ్రవాదులు, వారికి మద్దతు తెలిపేవారికి తగిన సమాధానమని పేర్కొన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి నివాళులర్పించారు. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి మొదటి వార్షికోత్సవం, సుపరిపాలన అంశాలపైనా ఈ భేటీలో ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది.



## కుమారుడిని పార్టీ నుంచి బహిష్కరించిన లాలూ...

రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన పెద్ద కుమారుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. తమ కుమారుడు వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించేలా చేస్తున్న చర్యలు.. సామాజిక న్యాయం కోసం పార్టీ చేస్తున్న సమష్టి పోరాటాన్ని బలహీనపరుస్తున్నాయని లాలూ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. తేజ్ ప్రతాప్ ప్రవర్తన కుటుంబ విలువలు, సంప్రదాయాలకు అనుగుణంగా లేదని అన్నారు. ఈ కారణాల వల్ల అతడిని పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇకపై తేజ్ ప్రతాప్‌కు ఆర్జేడీ పార్టీలో, తమ కుటుంబంలో స్థానం లేదని స్పష్టం చేశారు. శనివారం తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నానంటూ పెట్టిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో లాలూ ప్రసాద్ ఈ చర్యలు తీసుకున్నారు.

**అసలేమయ్యిందంటే?**

శనివారం తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో ఒక పోస్టు ప్రత్యక్షమైంది. ఆయన ఒక మహిళతో ఉన్న ఫొటో దానిలో ఉంది. ఆమె పేరు అనుష్క యాదవ్ అని, గత 12 ఏళ్లుగా తాము రిలేషన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇది కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అనంతరం దీనిపై ఆయన ఎక్స్ వేదికగా వివరణ ఇస్తూ.. తన సోషల్ మీడియాను ఎవరో హ్యాక్ చేశారని తెలిపారు. తన కుటుంబ గౌరవాన్ని దెబ్బతీసేందుకే ఎవరో ఇలాంటి పోస్టు చేశారని ఆరోపించారు. ఆ ఫొటో సైతం ఎడిట్ చేసిందని వెల్లడించారు. ఇలాంటి పుకార్లను నమ్మవద్దని తన

## దిల్లీని ముంచెత్తిన వాన..200 విమానాలపై ప్రభావం

దిల్లీ: దేశరాజధానిలో ఆదివారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. చాలా రోడ్లు, అండర్‌పాస్‌లు నీటితో నిండిపోవడంతో..కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. వాతావరణం అనుకూలంగా లేని కారణంగా దిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదాపు 200 విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా మరో 49 విమానాలను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది. విమానాల సమయాలను సంబంధిత వెబ్‌సైట్లలో చెక్ చేసుకోవాలని సూచించింది. అటు ఎయిరిండియా, ఇండిగో కూడా ప్రయాణికులకు అలర్ట్‌లు పంపించాయి. తాజా అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించాయి. శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి దిల్లీ నగరాన్ని విమానాశ్రయానికి అనుసంధానించే ప్రధాన అండర్‌పాస్ జలమయమవ్వడంతో డజన్ల కొద్దీ కార్లు, బస్సులు నీటమునిగాయి. రానున్న కొన్ని గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.




## తాజ్‌మహల్‌లో యాంటీడ్రోన్ వ్యవస్థ...!



ప్రపంచంలోనే అద్భుత కట్టడాల్లో ఒకటైన తాజ్‌మహల్‌కు ముప్పు తలపెడుతామంటూ ఇటీవల బెదిరింపులు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. గగనతల ముప్పులను దీటుగా ఎదుర్కొనేందుకు అత్యంత అధునాతన యాంటీ డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ''తాజ్ మహల్ కాంప్లెక్స్‌లో యాంటీ డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. దీనికి 7 నుంచి 8 కి.మీ పరిధిలో పనిచేసే సామర్థ్యం ఉంది. అయితే, ప్రస్తుతానికి ప్రధాన గోపురం నుంచి 200 మీటర్లు పరిధిలోనే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఈ ప్రాంతంలోకి ఏదైనా డ్రోన్ ప్రవేశిస్తే.. దాని సిగ్నల్స్‌ను ఆటోమేటిక్‌గా ఇది గుర్తించి జామ్ చేస్తుంది. తద్వారా దాన్ని పని చేయకుండా చేస్తుంది. దీనిని 'సాఫ్ట్ కిల్'గా చెబుతుంటాం'' అని తాజ్‌మహల్ సెక్యూరిటీని పర్యవేక్షించే ఏసీపీ సయ్యద్ ఆరిబ్ అహ్మద్ వెల్లడించారు. ఈ యాంటీ డ్రోన్ వ్యవస్థకు సంబంధించి పోలీసు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని, త్వరలోనే దీనికోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మరికొన్ని రోజుల్లోనే తాజ్‌లో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడాల్లో ఒకటిగా నిలిచిన తాజ్‌మహల్‌ను నిత్యం వేలాది మంది సందర్శిస్తుంటారు. ఇక్కడి భద్రతను ప్రస్తుతం సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, యూపీ పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. వీరికి అదనంగా అత్యంత అధునాతన డ్రోన్ నిర్వీర్య వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన అధికారులు.. ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలాఉంటే, ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌లోని ఉగ్ర, సైనిక స్థావరాలపై భారత సైన్యం కచ్చితమైన దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరం పాకిస్థాన్ కూడా భారత్‌పై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు తెగబడింది. అయితే, వీటిని యాంటీ డ్రోన్ వ్యవస్థల సాయంతో భారత దళాలు దీటుగా తిప్పికొట్టాయి. ఇలా శత్రు దాడుల నేపథ్యంలో దేశంలోని కీలక స్థావరాల వద్ద ఈ తరహా చర్యలు అనివార్యంగా మారుతోంది.

## సిట్ ఆహ్వానిస్తే.. లిక్కర్ స్కామ్‌లో బయటకు రాని విషయాలు వెల్లడిస్తా

- **వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ కీలక వ్యాఖ్యలు**
- **ఈ కుంభకోణంలోని చాలా విషయాలపై సిట్ ఇంకా దృష్టిసారించలేదన్న బీజేపీ ఎంపీ**
- **మద్యం దుకాణాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన ఉద్యోగుల జీతాల నుంచి కమీషన్ తీసుకున్నారని ఆరోపణ**
- **వాటి తాలూకు సాక్ష్యాధారాలు తన వద్ద ఉన్నాయన్న సీఎం రమేశ్**



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ విషయమై బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మద్యం కుంభకోణంలోని చాలా విషయాలపై సిట్ ఇంకా పూర్తిగా దృష్టిసారించలేదని ఆయన పేర్కొన్నారు. సిట్ ఆహ్వానిస్తే తాను వెళ్లి లిక్కర్ స్కామ్‌లో బయటకు రాని విషయాలు వెల్లడిస్తానన్నారు. ఢిల్లీలోని తన నివాసంలో శనివారం ఎంపీ సీఎం రమేశ్ మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో మద్యం దుకాణాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన ఉద్యోగుల జీతాల నుంచి ప్రతి నెలా రూ. 5 కోట్లు జగన్ మనుషులు కమీషన్‌గా వసూలు చేశారు. మద్యం దుకాణాలు, డిపోల వద్ద నియమించిన దాదాపు 11వేల మంది సెక్యూరిటీ సిబ్బంది వేతనాల నుంచి కూడా కమీషన్ల రూపంలో నెలకు రూ. 3 కోట్లు వసూలు చేసినట్లు నా వద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయి అని ఆయన అన్నారు. ఇక, విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. లేదంటే జగన్ రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని సీఎం రమేశ్ సవాల్ చేశారు.

## గాంధీ ఆసుపత్రిలో కొవిడ్ వార్డ్

- **60 బెడ్లతో ఏర్పాటు చేసిన అధికారులు**
- **పలు రాష్ట్రాల్లో కొవిడ్ కలకలం నేపథ్యంలో ముందుజాగ్రత్త**
- **పదిమంది వైద్య నిపుణులతో కమిటీ ఏర్పాటు**




దేశంలో కొవిడ్ వ్యాప్తి మరోమారు పెరుగుతుండడం, నగరంలో ఓ వైద్యుడికి తొలి కేసు నమోదు కావడంతో గాంధీ ఆసుపత్రి అధికారులు అప్రమత్తమయ్యారు. కొవిడ్ బాధితుల కోసం ప్రత్యేకంగా వార్డులు ఏర్పాటు చేశారు. మొత్తం 60 పడకలతో వార్డులు ఏర్పాటు చేసి, బాధితులకు చికిత్స అందించడానికి, కొవిడ్ వ్యాప్తి కట్టడికి పదిమంది వైద్య నిపుణులతో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వెలుగు చూస్తున్న కేసులు ప్రమాదకరమైనవి కావని, ప్రజలు జాగ్రత్తగా ఉంటే సరిపోతుందని వైద్యులు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని వివరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి చైర్మన్ గా ఏర్పాటైన ఈ కమిటీ కొవిడ్ కేసులు పెరిగితే రోగులకు అందించే అత్యవసర వైద్యం, వసతులపై ఎప్పటికప్పుడు సమావేశమై నిర్ణయాలు తీసుకుంటుందని డాక్టర్ కె.సునీల్ తెలిపారు. కొవిడ్ బాధితుల కోసం 3 ప్రత్యేక వార్డులు, అందులో 60 పడకలను సిద్ధం చేసినట్లు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.సునీల్ తెలిపారు. ఇందులో అత్యవసర వైద్య వసతులు కలిగిన 15 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

## ఇండియన్ స్టార్టప్‌తో జతకట్టిన యమహా..



**న్యూఢిల్లీ:** భారతదేశంలో ఈవీ రంగం రోజురోజుకూ వృద్ధి చెందుతుంది. ప్రతి నెలా ఏదో ఓ కంపెనీ కొత్త ఈవీ స్కూటర్‌ను మార్కెట్‌లోకి లాంచ్ చేస్తుంది. దేవంలో టాప్ మోటర్ కంపెనీలుగా వెలుగొందుతున్న అన్ని కంపెనీ తమ ఈవీ వెర్షన్లను లాంచ్ చేశాయి. ఈ నేపథ్యంలో యమహా కూడా ఈవీ వెర్షన్ లాంచ్ చేసేందుకు భారతీయ స్టార్టప్ కంపెనీ రివర్ ఇండీతో జతకట్టింది.

యమహా కంపెనీ త్వరలో రివర్ ఇండి ఆధారంగా సరసమైన ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లో విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. రాబోయే యమహా ఈవీకు ఆర్‌వై 01 అనే కోడే నేమ్ కూడా ఉంది. రివర్ ఇండి ఈవీ స్కూటర్ మాదిరిగానే బ్యాటరీ నిర్వహణ వ్యవస్థ, పవర్ ట్రెయిన్‌ను ఉపయోగిస్తుందని పలు నివేదికల ద్వారా స్పష్టమైంది. జపాన్‌కు చెందిన యమహా మోటార్ కంపెనీ ఫిబ్రవరి 2024లో రివర్ ఇండి కంపెనీ సుమారు 40 మిలియన్ల డాలర్ల పెట్టుబడి పెట్టింది. రివర్ ఇండీ భాగస్వామ్యంతో కొత్త యమహా ఆర్‌వై01 ఎలక్ట్రిక్ స్కూటర్ ఈ పండుగ సీజన్‌తో ఉత్పత్తి ప్రారంభించి ఈ సంవత్సరం చివరి నాటికి లాంచ్ అవుతుందని భావిస్తున్నారు.

ఈ కొత్త ఈవీ భారతదేశం, అమెరికా, యూరప్లోని యమహా గ్లోబల్ ఇంజనీరింగ్ బృందాలు అభివృద్ధి చేస్తున్నాయి. యమహా డిజైన్ మరియు బ్రాండ్ ఎథోస్‌తో వచ్చే ఈ స్కూటర్ లాంచ్ అయినా ఇంజనీరింగ్, టెస్టింగ్, పరిశోధన, అభివృద్ధి, అన్నీ రివర్ కంపెనీ ద్వారా నిర్వహిస్తారు. డిజైన్ ఫైనల్ అయిన తర్వాత యమహా ఆర్‌వై ఈవీ స్కూటర్‌ను బెంగళూరులోని రివర్ కంపెనీ తయారు చేస్తుంది. ఇక్కడి నుంచే ఈ స్కూటర్ ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. దీని వల్ల దేశంలో ఉత్పత్తి పరిమాణం పెరుగడంతో ఖర్చులు నియంత్రణలో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

యమహా వంటి గ్లోబల్ కంపెనీ పవర్ ట్రెయిన్, ఇంజనీరింగ్, బ్యాటరీ ఇంటిగ్రేషన్, టెస్టింగ్తో కూడిన భారతీయ ఎలక్ట్రిక్ వాహన స్టార్టప్‌ను విశ్వసించడం శుభపరిణామమని నిపుణులు చెబుతున్నారు. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల కోసం పెరుగుతున్న పరిశోధన, అభివృద్ధి, తయారీ సామర్థ్యాలకు నిదర్శనంగా ఈ భాగస్వామ్యంగా సాక్ష్యంగా నిలుస్తుందని నివేదికల్లో స్పష్టం చేస్తున్నారు. యమహా ఆర్‌వై 01 భారతదేశంలో ప్రారంభిస్తే టీవీఎస్ ఐక్యూబ్, ఏథర్ రిజ్టా, బజాజ్ చేతక్, హీరో విడీ వీ1 వంటి ఈవీ స్కూటర్లకు గట్టి పోటీనిస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## జూన్ నెలలో సగం రోజులు బ్యాంకులకు సెలవులే..!




**న్యూఢిల్లీ:** వచ్చే నెలలో బ్యాంకులకు ఏయే రోజుల్లో సెలవులు ఉన్నాయో ముందస్తుగా తెలుసుకోవడం చాలా ముఖ్యం. మీరు ఏదైనా ముఖ్యమైన పని కోసం బ్యాంకుకు వెళుతున్నట్లయితే, వచ్చే నెలలో అంటే జూన్‌లో మీ నగరంలో ఎన్ని రోజులు బ్యాంకులు మూసివేయబడతాయో ముందుగానే తెలుసుకోవచ్చు. చాలా మందికి ప్రతి రోజు బ్యాంకు పని నిమిత్తం వెళ్తుంటారు. అయితే బ్యాంకుకు వెళ్లే ముందు ఏయే రోజుల్లో బ్యాంకులకు సెలవులు ఉంటాయోనన్న విషయాన్ని కూడా తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఇప్పుడు మే నెల ముగిసి జూన్ నెల వచ్చేస్తోంది. వచ్చే నెలలో బ్యాంకులకు ఏయే రోజుల్లో సెలవులు ఉన్నాయో ముందస్తుగా తెలుసుకోవడం చాలా ముఖ్యం. మీరు ఏదైనా ముఖ్యమైన పని కోసం బ్యాంకుకు వెళుతున్నట్లయితే, వచ్చే నెలలో అంటే జూన్‌లో మీ నగరంలో ఎన్ని రోజులు బ్యాంకులు మూసివేయబడతాయో ముందుగానే తెలుసుకోవచ్చు.

**బ్యాంకులకు 13 రోజులు సెలవులు:**

1 జూన్-ఆదివారం కావడంతో ఈ రోజు దేశవ్యాప్తంగా బ్యాంకులు మూసి ఉంటాయి.

6 జూన్-ఈద్ ఉల్ అధా (బక్రీద్) సందర్భంగా తిరువనంతపురం, కొచ్చిలో బ్యాంకులకు సెలవు.

7 జూన్-అగర్తల, ఐజ్వాల్, బేలాపూర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, డెహ్రాడూన్, గౌహతి, ఏపీ, తెలంగాణ, ఇంఫాల్, జైపూర్, జమ్మూ, కాన్పూర్, కొహిమా, కోల్‌కతా, లక్నో, ముంబై, నాగ్‌పూర్, రాణా, పాట్, రానాజీ, పాట్, నాగ్‌పూర్‌లలో బక్రీద్ ఈద్ ఉల్ జుహా కారణంగా బ్యాంకులకు సెలవు ఉండనుంది.

8 జూన్-ఆదివారం కారణంగా దేశవ్యాప్తంగా బ్యాంకులు మూసి ఉండనున్నాయి.

10 జూన్-శ్రీ గురు అర్జున్ దేవ్ జీ బలిదానం దినోత్సవం కారణంగా పంజాబ్‌లో బ్యాంకులు మూసి ఉంటాయి.

11 జూన్-సంత్ గురు కబీర్ జయంతి కారణంగా గాంగ్టక్, సిమ్లాలోని బ్యాంకులకు సెలవు.

14 జూన్-ఈ రోజు నెలలో రెండవ శనివారం కావడంతో దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు.

15 జూన్-ఆదివారం సెలవు కారణంగా దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు.

22 జూన్-ఆదివారం సెలవు కారణంగా బ్యాంకులు పనిచేయవు.

27 జూన్-రథయాత్ర/కాంగ్ రథజాత్ర కారణంగా ఇంఫాల్, భువనేశ్వర్‌లోని బ్యాంకులకు సెలవు.

28 జూన్-నెలలో నాల్గవ శనివారం కావడంతో దేశవ్యాప్తంగా బ్యాంకుల్లో పని చేయవు.

29 జూన్-ఈ రోజు ఆదివారం. దీని కారణంగా దేశ వ్యాప్తంగా బ్యాంకులకు సెలవు.

30 జూన్ - అందుబాటులో లేకపోవడం వల్ల ఐజ్వాల్‌లోని బ్యాంకులు పనిచేయవు.

## వారం రోజుల్లో ఆ టాటా ఈవీ కారు లాంచ్..

### మైలేజ్ విషయంలో నో పోటీ..!




**న్యూఢిల్లీ:** టాటా మోటర్స్ లవర్స్ ఎప్పటినుంచో ఆసక్తి ఎదురుచూస్తున్న ఈవీ ఎస్‌యూవీ హారియర్ గురించి కంపెనీ కీలక ప్రకటన చేసింది. ఈ ఈవీ కారు లాంచ్ తేదీని అధికారంగా ప్రకటించింది. భారతదేశంలో టాటా ఎలక్ట్రిక్ కార్లకు ఉన్న డిమాండ్ నేపథ్యంలో అత్యంత అధునాతన ఫీచర్లతో హారియర్ ఈవీను మార్కెట్‌లోకి లాంచ్ చేస్తామని పేర్కొంది.

టాటా హారియర్ ఈవీ ఎస్‌యూవీ కారు జూన్ 3, 2025న ప్రారంభిస్తామని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ఇండియా మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ఈ కారును ప్రవేశపెట్టారు. హారియర్ ఈవీ కంపెనీకు సంబంధించిన యాక్టి ఈవీ ప్లస్ ప్లాట్‌ఫారమ్‌పై నిర్మించారు. జాగ్వార్ ల్యాండ్ రోవర్‌తో కలిసి అభివృద్ధి చేసిన ఓమేగా ఆర్కిటెక్చర్ ఆధారంగా ఈ కారు పని చేస్తుంది. ఈ ఎస్‌యూవీ డ్యూయల్ మోటార్ ఆల్-వీల్ డ్రైవ్ సిస్టమ్‌ను పొందుతుంది. హారియర్ ఈవీ దాదాపు 500 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.



# కేకేఆర్‌పై సన్‌రైజర్స్ గ్రాండ్ విక్టరీ

### రివేంజ్ రీ సౌండ్‌కి దద్దరిల్లిన స్టేడియం!

### విజయంతో ఐపీఎల్ 2025కి వీడ్కోలు పలికిన సన్‌రైజర్స్

### కోల్‌కతా నైట్ రైడర్స్‌పై ఘన విజయం సాధించిన ఎస్ఆర్‌హెచ్

### ఐపీఎల్ 2024 ఫైనల్, ఈ సీజన్ మ్యాచ్‌కి రివేంజ్ తీర్చుకున్న ఆరెంజ్ ఆర్మీ



**న్యూఢిల్లీ:** సన్‌రైజర్స్ హైదరాబాద్ గ్రాండ్ విక్టరీని అందుకుంది. ఐపీఎల్ 2025ను విజయంతో ముగించింది. ఢిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించి ఐపీఎల్ 2024 ఫైనల్స్‌తో పాటు.. ఈ సీజన్‌లో మ్యాచ్‌కి రివేంజ్ తీర్చుకుంది. సన్‌రైజర్స్ రివేంజ్‌కి స్టేడియం రీ సౌండ్ వచ్చింది.

ఐపీఎల్ 2025లో భాగంగా ఢిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు రికార్డ్ స్కోర్‌తో కేకేఆర్ బౌలర్లను ఊచకోత కోసింది. ఎస్ఆర్‌హెచ్ ఇచ్చిన 279 పరుగుల టార్గెట్‌ను ఛేదించడంలో కోల్‌కతా చతికిలపడింది. 18.4 ఓవర్లలో 168 పరుగలే చేసి ఆలౌట్ కావడంతో 110 పరుగుల తేడాతో ఓటమిపాలయింది.

279 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ ఆటగాళ్లు దూకుడుగా ఇన్నింగ్స్ ఆరంభించినా ప్రతిఫలం లేకుండా పోయింది. ఓపెనర్ సునీల్ నరైన్ మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 16 బంతుల్లోనే 31 పరుగులు చేసినా.. ఆ ఫామ్‌ని మిగతా ప్లేయర్లు కొనసాగించలేకపోయారు. మరో ఓపెనర్ క్వింటన్ డికాక్ దారుణంగా విఫలమయ్యాడు. 13 బంతులు ఆడి కనీసం ఒక్క ఫోర్ కూడా బాదకుండా 9 పరుగులకే అవుటయ్యాడు. కెప్టెన్ అజింక్య రహానే కూడా 15 పరుగులు చేసి పెవిలిన్ బాట పట్టాడు.

అంగ్‌క్రిష్ రఘువంశీ కూడా 18 బంతులు ఆడి 14 పరుగులే చేయగా.. రింకూ సింగ్ 9 పరుగులకే అవుటయ్యాడు. హార్డ్ హిట్టర్ ఆండ్రీ రసెల్ గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. దాంతో కోల్‌కతా నైట్ రైడర్స్ 95 పరుగులకే ఆరు కీలక వికెట్లు కోల్పోయింది. కనీసం 140 పరుగులు కూడా చేయకుండా ఆలౌట్ అవుతుంది అని అందరూ అనుకున్నారు.

రమణదీప్ సింగ్ సిక్సర్లతో టీమ్‌లో జోష్ నింపినప్పటికీ 5 బంతుల్లో 13 పరుగులే చేసి అవుటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన బౌలర్ హర్షిత్ రాణా ఫోర్లు, సిక్సర్లు బాదడంతో.. మనీష్ పాండే కూడా బ్యాట్‌కి పని చెప్పాడు. వీరిద్దరూ వీర బాదుడు బాదడంతో కోల్‌కతా నైట్ రైడర్స్ గౌరవ ప్రధమైన స్కోర్ చేయగలిగింది. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 52 పరుగులు భాగస్వామ్యం నెలకొల్పారు. మనీష్ పాండే 23 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 37 పరుగులు చేసి అవుటయ్యాడు. హర్షిత్ రాణా 21 బంతుల్లో 2 ఫోర్లు, మూడు సిక్సర్లతో 34 పరుగులు చేసి అవుటయ్యాడు. దాంతో కేకేఆర్ 18.4 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌట్ అయింది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో జయదేవ్ ఉనద్కత్, హర్ష్ దుబే, ఇషాన్ మలింగ తలో మూడు వికెట్లు తీసుకున్నారు. ఈ సీజన్‌లో 14 మ్యాచ్‌లు ఆడిన సన్‌రైజర్స్ ఆరు గెలిచి, ఐదు ఓడగా.. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. ఈ విజయంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి ఎగబాకింది.

## ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు పేస్ అస్త్రం..

### ఫుల్ ఖుషీలో ఆర్సీబీ



**బెంగళూరు:** ఐపీఎల్ 18వ సీజన్ ప్లేఆఫ్స్ మ్యాచ్‌లకు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు గుడ్‌న్యూస్. తొలి టైటిల్ కలను సాకారం చేసుకోవాలనుకుంటున్న ఆ జట్టు పేస్ బలం మరింత పెరగనుంది. టోర్నీ పునరుద్ధరణ తర్వాతి రెండు లీగ్ మ్యాచ్‌లకు దూరమైన ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ తిరిగి స్క్వాడ్‌తో కలిశాడు. ఆదివారం ఈ విషయాన్ని ఆర్సీబీ హెడ్‌కోచ్ దినేశ్ కార్తిక్ వెల్లడించాడు.

'హేజిల్‌వుడ్ మళ్లీ ఆర్సీబీతో కలవడం పట్ల యావత్ బెంగళూరు సంతోషంగా ఉంది. ఎందుకంటే.. పవర్ ప్లే, డెత్ ఓవర్లలో తాను ఎంత ప్రమాదకరమైన బౌలరో హేజిల్ నిరూపించాడు. ఇప్పుడు అతడు మాతో ఉన్నాడు. ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉండడం నిజంగా మాకు ప్లస్ పాయింట్' అని కార్తిక్ తెలిపాడు.

మే 17న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షార్పణం కావడంతో.. ఆఖరి రెండింటిలో అయినా విజయంతో ఆత్మవిశ్వాసంతో నాకౌట్ మ్యాచ్‌లకు సిద్ధం కావాలని భావించింది. అయితే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ షాక్ ఇవ్వడంతో 42 పరుగుల తేడాతో ఓడిపోయింది. దాంతో, చివరిదైన లీగ్ మ్యాచ్‌లో మే27 లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆర్సీబీ తలపడనుంది.

**భుజం గాయం నుంచి కోలుకొని..**

తొలి టైటిల్ వేటలో ఉన్న ఆర్సీబీ 18వ సీజన్‌లో అదరగొట్టడంలో హేజిల్‌వుడ్ పాత్ర ఉంది. పవర్ ప్లే, డెత్ ఓవర్లలో నిప్పులు చెరుగుతూ పరుగులను నియంత్రించే ఈ స్పీడ్‌స్టర్.. బెంగళూరుకు ప్రధాన పేస్ అస్త్రంగా మారాడు. అయితే.. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రికత్తల కారణంగా టోర్నీ వాయిదా పడడంతో జోష్ హేజిల్‌వుడ్ స్వదేశం వెళ్లపోయాడు.

భుజం గాయంతో బాధపడుతున్న అతడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆడాల్సి ఉంది. కాబట్టి..కొన్నిరోజులు విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నాడు. కానీ, ప్లే ఆఫ్స్ పోరులో రజత్ పాటిదార్ బృందానికి తన సేవలు అవసరమని భావించిన ఈ పొడగరి పేసర్ తిరిగి స్క్వాడ్‌లో కలిశడు. ఇప్పటివరకూ హేజిల్‌వుడ్ ఐపీఎల్ 18వ సీజన్‌లో 17. 27 సగటుతో 18 వికెట్లు పడగొట్టాడు

### అయోధ్యలోని హనుమాన్ గర్హిలో

## విరాట్ దంపతుల పూజలు

**అయోధ్య:** భారత స్టార్ క్రికెటర్, టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ, ఆయన భార్య అనుష్క శర్మ అయోధ్య లోని ప్రముఖ హనుమాన్ గర్హి దేవాలయాన్ని ఆదివారం సందర్శించారు. అక్కడ హనుమంతుడిని



దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూలమాలలతో కోహ్లీ, అనుష్క శర్మ దంపతులను సత్కరించారు.

ఇద్దరికీ నుదుట తిలకం దిద్దారు. ఆ తర్వాత స్వామివారి చిత్రపటాలను అందజేశారు. కాగా ఇటీవలే విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ దంపతులు ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆధ్యాత్మిక గురువైన ప్రేమా గోవింద్ శరణ్ జీ మహరాజ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత విరాట్ కోహ్లీ ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తున్నాడు. అనుష్కశర్మతో కలిసి పలు క్షేత్రాలు సందర్శిస్తున్నాడు.

## వీడ్కోలుపై నాలుగు నెలల్లో నిర్ణయం..

### వచ్చే సీజన్‌కు సారథి అతడే..!



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 18వ సీజన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ విజయంతో ముగించింది. లీగ్ దశ చివరి పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో గుజరాత్ టైటాన్స్‌కు మహేంద్ర సింగ్ ధోనీ సేన చెక్ పెట్టింది. అయితే.. ఇప్పుడు అందరి మెదళ్లలో తాలా మరో సీజన్ ఆడతాడా? అనే ప్రశ్నే ఉత్పన్నమవుతోంది. రెగ్యులర్ సారథి రుతురాజ్ గైక్వాడ్ గాయంతో తప్పుకోగా.. మళ్లీ పగ్గాలు అందుకున్న మహీ వీడ్కోలుపై మరో నాలుగు నెలల్లో నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు. అంతేకాదు వచ్చే సీజన్‌కు కెప్టెన్ ఎవరు? అనే విషయంపై కూడా స్పందించాడీ లెజెండ్.

గుజరాత్‌పై గెలుపు అనంతరం ధోనీ మాట్లాడుతూ మాట్లాడుతూ సీఎస్కే భవితవ్యం.. వీడ్కోలు విషయాలపై గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'ఈ సీజన్ మాకు అనుకూలంచలేదు. బ్యాటింగ్ యూనిట్‌గా విఫలయం అయ్యాం. కానీ, ఈరోజు మా కుర్రాళ్లు ఖతర్నాక్ ఆడారు. నా విషయాని కొస్తే ఇంకా నాలుగైదు నెలల సమయం ఉంది. రిటైర్మెంట్ నిర్ణయంపై నేను తొందరపడడం లేదు. అలా అనీ నేను మరో సీజన్ ఆడుతాను అనిగానీ, ఆడను అనిగానీ చెప్పలేను.

ఎందుకంటే.. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవాలి. ప్రదర్శనను బట్టే వీడ్కోలు పలకాలి అనుకుంటే.. కొందరు క్రికెటర్ల కెరియర్ 22 ఏళ్లకే ముగుస్తుంది. అందుకే.. నేను హడావిడిగా ఏ నిర్ణయం తీసుకోను. సీజన్ ముగిసింది కాబట్టి.. రాంచీకి వెళ్తాను. నాకు నచ్చినట్టుగా గడపాలనుకుంటున్నా. నాకెంతో ఇష్టమైన బైక్‌ల మీద చక్కర్లు కొడుతాను' అని ధోనీ వెల్లడించాడు.

**రుతురాజ్‌కే పగ్గాలు**

'తర్వాతి సీజన్‌లో సీఎస్కే సారథి ఎవరు?' అనే ప్రశ్నకు ఇంకెవరు రుతురాజ్ ఉన్నాడుగా అని బదులిచ్చాడు ధోనీ. రుతురాజ్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. అతడి గురించి ఆందోళన అవసరం లేదు. వచ్చే సీజన్ గురించి మేము మరీ ఎక్కువగా ఆలోచించడం లేదు. కెప్టెన్‌గా అతుడు సీఎస్కేను మళ్లీ గాడిలో పెడుతాడని నమ్మకం నాకుంది అని మహీ భాయ్ తెలిపాడు. 17వ సీజన్ ముందు కెప్టెన్సీ వదులుకున్న ధోనీ.. తన వారసుడిగా రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేశాడు.

అయితే.. 18వ ఎడిషన్ మధ్యలో గైక్వాడ్ ఎడమచేతి బొటనవేలి గాయంతో టోర్నీకి దూరమయ్యాడు. దాంతో, మళ్లీ సీఎస్కే సారథ్యాన్ని చేపట్టిన తాల.. కుర్రాళ్లలో ఆత్మవిశ్వాసం నింపుతూ జట్టులో స్ఫూర్తి రగిలించాడు. ఈ సీజన్‌లో ఫినిషర్‌గానూ రాణించిన ధోనీ.. 13 ఇన్నింగ్స్‌ల్లో 196 రన్స్ కొట్టాడు. అందులో 12 ఫోర్లు, 12 వఉన్నాయి.

# ధనుష్ 'కుబేర' టీజర్ విడుదల




**టాకీస్:** టాలీవుడ్ క్లాసిక్ చిత్రాల దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కుబేర. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో మల్టీ లింగ్వెల్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 20, 2025న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి ట్రాన్స్ ఆఫ్ కుబేరా అంటూ టీజర్‌ను వదిలారు మేకర్స్. నాది నాది నాది అంటూ పాటతో సాగిన ఈ టీజర్ ఆసక్తికరంగా సాగింది.

ఈ టీజర్ చూస్తుంటే.. ధనుష్ ఈ సినిమాలో ఇదివరకెన్నడూ చేయని సరికొత్త పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. నాగార్జున కూడా సాలిడ్ రోల్ పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో దేవిశ్రీ ప్రసాద్ ఇచ్చిన స్కోర్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు.

## వార్ డ్రామాతో రాబోతున్న అమితాబ్ మనవడు..

### ఇంట్రెస్టింగ్‌గా 'ఇక్కిస్' అనౌన్స్‌మెంట్ టీజర్

**టాకీస్:** బాలీవుడ్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నందా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ఇక్కిస్. ఈ సినిమా విడుదల తేదీని మ్యాడాక్ ఫిల్మ్స్ అధికారికంగా ప్రకటించింది. శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వం వహించిన ఈ వార్ డ్రామా చిత్రం 2025 అక్టోబర్ 2న, గాంధీ జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. చిత్ర బృందం ఈ విషయాన్ని వెల్లడిస్తూ, ఒక ఆసక్తికరమైన అనౌన్స్‌మెంట్ టీజర్‌ను విడుదల చేసింది.




'ఇక్కిస్' చిత్రం 1971 ఇండో-పాక్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేత్రపాల్ జీవితం ఆధారంగా తెరకెక్కబోతుంది. పరమ వీర చక్ర పురస్కారం పొందిన అతి పిన్న వయస్కులలో ఒకరైన ఖేత్రపాల్ ధైర్యం, త్యాగాలను ఈ సినిమా చూపించబోతుంది. విడుదలైన టీజర్‌లో 1971 నాటి బాసంతర్ యుద్ధం సమయంలో పంపిన ఒక టెలిగ్రామ్ కనిపిస్తుంది. ఆ టెలిగ్రామ్ అరుణ్ ఖేత్రపాల్ మరణ వార్తను తెలియజేస్తుంది. ఈ టీజర్ యుద్ధ సన్నివేశాలతో పాటు ఖేత్రపాల్ శౌర్యంగా పోరాడుతున్న దృశ్యాలను చూపిస్తూ ఉత్కంఠగా సాగింది.

## ఫిల్మ్ బ్యాక్‌గ్రౌండ్ ఉంటే.. హారర్ సినిమా చేసేదాన్ని కాదు..

### నెపోటిజంపై అదా శర్మ కామెంట్స్




**టాకీస్:** బాలీవుడ్‌లో బంధుప్రీతి (నెపోటిజం)పై తరచుగా చర్చలు జరుగుతాయన్న విషయం తెలిసిందే. ఈ విషయంపై నటి అదా శర్మ తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను సినిమా కుటుంబం నుండి వచ్చి ఉంటే.. తనను హారర్ సినిమాతో పరిచయం చేసేవారు కాదని ఆమె పేర్కొన్నారు. అదా శర్మ తన కెరీర్‌ను 2008లో విడుదలైన హారర్ సినిమా '1920' తో ప్రారంభించారు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద విజయం సాధించినప్పటికీ, ఒక నటిగా మంచి గుర్తింపు లభించలేదు. దీనిపై అదా శర్మ మాట్లాడుతూ, "నేను సినిమా కుటుంబం నుండి వచ్చి ఉంటే, నన్ను పరిచయం చేయడానికి ఒక పర్ఫెక్ట్ రొమాంటిక్ సినిమా కోసం వేచి ఉండేవారు. నా కుటుంబం నన్ను హారర్ సినిమా చేయనిచ్చేది కాదు. ఎవరు తమ కెరీర్‌ను దెయ్యం పట్టినట్లు, నల్లటి పళ్లతో తెరపై కనిపిస్తూ ప్రారంభిస్తారు? ప్రముఖుల కుటుంబం నుండి వచ్చి ఉంటే, ఒక సాధారణ రొమాంటిక్ సినిమాతో నా కెరీర్ ప్రారంభమయ్యే అవకాశం ఉండేది. నేను '1920' తో ప్రారంభించాను, అందుకు నేను అదృష్టవంతురాలిని. నేను ఏదైనా కొత్తగా ప్రయత్నించినప్పుడల్లా ప్రేక్షకులు నన్ను అంగీకరించారు, బహుశా అందుకే సినీ నిర్మాతలు కూడా నన్ను విభిన్న పాత్రలలో నటించడానికి ధైర్యం చేస్తున్నారు" అని అన్నారు. అదా శర్మ 'కమాండో' ఫ్రాంచైజీలో యాక్షన్ పాత్రలతో ఆకట్టుకోవడమే కాకుండా, 'ది కేరళ స్టోరీ' చిత్రంలో కూడా నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నా రు. ఈ విషయంపై అదా శర్మ మాట్లాడుతూ, 'ది కేరళ స్టోరీ' చూసినప్పుడు, 'ఓహ్, ఆమె యాక్షన్ చేయగల దు, ఆమె ఎందుకు టెర్రరిస్టుల ను కొట్టడం లేదు?' అని ప్రజలు అనలేదు. 'సన్‌ఫ్లవర్ సీజన్ 2' లో బార్ డ్యాన్సర్ రోసీగా, 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' లో ఐపీఎస్ అధికారిగా కూడా ప్రజలు నన్ను మెచ్చుకున్నారు. నా కెరీర్ ఈ విధంగా విభిన్నంగా సాగినందు కు నేను చాలా అదృష్టవంతురాలి ని" అని తెలిపా రు. అదా శర్మ తన కెరీర్‌లో విభిన్నమైన, సవాలుతో కూ డిన పాత్రలను ఎంచు కుంటూ ప్రేక్షకులను అల రిస్తున్నారు. ప్రస్తుతం అదా శర్మ తన రాబోయే ప్రాజెక్ట్‌లో ఒక దేవత పాత్రలో కనిపించ నున్నారు.

## గార్జియస్ లుక్‌లో మీనాక్షి చౌదరి




టాకీస్: సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో మీనూ పాత్రలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు ఈ మధ్య నిత్యం సోషల్ మీడియాలో ఉంటూ తన అందచందాలతో కుర్రకారును ఆగం చేస్తుంది. బంగారు రంగు డ్రెస్‌లో బంగరంలో మెరిసిపోతుంది. తాజాగా ఈ బ్యూటీ గోల్డ్ కలర్ డ్రెస్‌లో తన గ్లామర్‌తో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు అందిరినీ తెగ ఆకట్టుకుంటున్నాయి.

అందాల ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ బ్యూటీ వరసగా బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంటూ వరస సినిమాలతో దూసుకెళ్తుంది. అంతే కాకుండా కుర్రకారు ఫేవరెట్ హీరోయిన్‌గా మంచి ఫేమ్ తెచ్చుకుంది.

నటి మీనాక్షి అప్ స్టార్స్ అనే హిందీ సినిమాతో నటిగా సిల్వర్ స్క్రీన్‌కు పరిచయమైంది.హిందీ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకొని, ఇచ్చట వాహనములు నిలపరాదు అనే సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. ఇక ఈ సినిమాలో ఈ బ్యూటీ తన నటనతో, గ్లామర్‌తో మంచి మార్కులు కొట్టేసింది. దీంతో వరసగా ఈ చిన్నదానికి ఆఫర్స్ క్యూ కట్టాయి. దీని తర్వాత వరసగా ఈ అందాల ముద్దుగుమ్మ ఖిలాడీ, హిట్2 , గుంటూరు కారం, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం, మట్కా, మెకానిక్ రాఖీ వంటి సినిమాల్లో నటించి, బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంది. ముఖ్యంగా ఈ చిన్నది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ మూవీలో వెంకటేష్ గర్ల్ ఫ్రెండ్‌గా నటించి, తన నటనతో విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది. దీంతో వరసగా హిట్స్ అందుకుంటూ టాలీవుడ్ గోల్డెన్ లెగ్ అయిపోయింది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది ఎప్పటికప్పుడు తన వరస ఫొటో షూట్‌తో కుర్రకారును మాయ చేస్తుంటుంది.

తాజాగా ఈ బ్యూటీ గోల్డ్ కలర్ డ్రెస్‌లో తన గ్లామర్‌తో ఆకట్టుకుంటుంది. గ్లామర్ లుక్‌లో ఈ చిన్నది చాలా బ్యూటిఫుల్‌గా కనిపిస్తుంది. తన చిలిపి నవ్వుతో అభిమానులను కట్టిపడేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి.

## కార్తీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన 'సర్దార్ 2' టీమ్

**టాకీస్:** తమిళ సినీ పరిశ్రమ నుంచి వచ్చి తెలుగులోనూ స్టార్‌డమ్ సంపాదించుకున్న నటుడు కార్తీ. 'యుగానికి ఒక్కడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కార్తీ, ఆ తర్వాత 'ఆవారా', 'నా పేరు శివ', 'ఖాకీ', 'ఖైదీ', 'పొన్నియన్ సెల్వన్' వంటి చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. అయితే కార్తీ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రాలలో సర్దార్ ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళంతో పాటు తెలుగులోనూ రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అయితే ఈ సినిమాకు తాజాగా సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది.

నేడు కార్తీ పుట్టినరోజు కావడంతో తాజాగా ఆయనకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. కొత్త పోస్టర్‌ను పంచుకుంది టీమ్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టర్ వైరల్‌గా మారింది.

'సర్దార్ 2' సినిమాకు యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. పార్ట్ 1కు జీవీ ప్రకాష్ కుమార్ సంగీత దర్శకుడిగా పని చేయగా, సీక్వెల్‌కు యువన్ శంకర్ రాజాను తీసుకోవడం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. అంతేకాకుండా, ఈ సీక్వెల్‌లో స్టార్ హీరో విజయ్ సేతుపతి కీలక పాత్రలో నటించబోతున్నారు. 'సర్దార్ 2' చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ నిర్మిస్తోంది.




## టైటిల్‌తో క్యూరియాసిటీ పెంచేస్తున్న కార్తీక్ రాజు

**టాకీస్:** కౌసల్య కృష్ణమూర్తి, అథర్వ సినిమాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు మల్టీ టాలెంటెడ్ యాక్టర్ కార్తీక్ రాజు. ఇటీవలే శ్రీవిష్ణు నటించిన సింగిల్ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే కూడా అందించాడు. కార్తీక్ రాజు సరికొత్త టైటిల్‌తో సినిమాను లాంచ్ చేసి అందరి అటెన్షన్ తనవైపునకు తిప్పుకుంటున్నాడు. కార్తీక్ రాజు నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే'. ఈ చిత్రానికి రాజా దుస్సా దర్శకత్వం వహిస్తున్నాడు.

శ్రీ రామకృష్ణ సినిమా బ్యానర్ పై గాలి కృష్ణ నిర్మిస్తున్న ఈ మూవీ ఘనంగా పూజా కార్యక్రమాలతో లాంచ్ అయింది. కాగా ఈ చిత్రానికి అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే అంటూ డిఫరెంట్ టైటిల్‌ను పెట్టి సినిమాపై ఆసక్తిని పెంచేస్తున్నాడు. ఈ మూవీ లాంచ్ సందర్భంగా డైరెక్టర్ రాజా దుస్సా మాట్లాడుతూ.. ఇది ఒక పీరియాడిక్ సినిమా. హ్యూమార్ టచ్ ఇస్తూనే.. బలమైన భావోద్వేగాలతో సినిమా ఉండబోతుంది. వరంగల్‌లో 1980లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా సినిమా రాబోతుంది. శరవేగంగా షూటింగ్ షెడ్యూల్ ప్లాన్ చేశామని అన్నాడు. కార్తీక్ రాజు మాట్లాడుతూ.. 80స్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా ఉండనుంది. సక్సెస్‌తో దూసుకెళ్తున్న కాజల్ చౌదరితో పనిచేయడం ఎక్జయిటింగ్‌గా ఉందన్నాడు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.